www.aryadvi.com
తెలుగు దినపత్రిక
News Daily
# ఆర్యాద్వి
శుక్రవారం 23-10-2026
అక్షర సత్యం - ప్రజా సాక్ష్యం
సంపుటి (VOLUME) : 1 సంచిక (ISSUE): 1
పేజీలు : 8
వెల : 1/-
Simultaneously Published from: Hyderabad | Vijayawada | Visakhapatnam




మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

# సమన్వయమే లక్ష్యంగా నేడు డీజీపీల సమావేశం



## ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి

## డీజీపీ సీవీ ఆనంద్

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా మరింత మెరుగైన సమన్వయం కోసం శుక్రవారం దక్షిణాది రాష్ట్రాల డీజీపీలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్(టీజీఐసీసీసీ)లో జరగనున్న ఈ సమావేశానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళంతోపాటు కేంద్రపాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ దీవులు, - మిగతా 2లో

# ఏపీకి మరో తుపాను ముప్పు?

## బంగాళాఖాతంలో అనుకూల పరిస్థితులు!

- బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడిన వాతావరణ వ్యవస్థ
- అండమాన్ సమీపంలో ఉపరితల ఆవర్తనం గుర్తింపు
- అక్టోబర్ 23 నాటికి అల్పపీడనంగా మారే అవకాశం
- పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ ఏపీ తీరం వైపు రావొచ్చని అంచనా
- తుపానుగా మారితే కోస్తాంధ్రపై ప్రభావం చూపే సూచనలు 2లో





### హైదరాబాద్‌లో ఘనంగా 'అలయ్ బలయ్'..

# అట్టహాసంగా వేడుకలు

- నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో అలయ్ బలయ్ వేడుకలు ప్రారంభం
- మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఆయన కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం
- 'నషా ముక్త్ భారత్' థీమ్‌తో ఈ ఏడాది వేడుకల నిర్వహణ
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాంస్కృతిక ప్రదర్శనలు

- మిగతా 2లో



### వరంగల్ కోట అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్..

# రూ. 382 కోట్లు మంజూరు

- వరంగల్ కోట అభివృద్ధికి ప్రభుత్వ పరిపాలన అనుమతులు
- మొత్తం రూ. 382 కోట్ల విలువైన పనులకు గ్రీన్ సిగ్నల్
- వేయి స్తంభాల గుడి, బస్ టెర్మినల్ వంటి పనులకు ఆమోదం
- ప్రపంచ బ్యాంకు నిధులతో 'కుడా' ఆధ్వర్యంలో పనుల నిర్వహణ
- చారిత్రక ప్రదేశాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

2లో

# బీసీ కులగణనలో తప్పులుంటే సరిచేస్తాం..

## హైదరాబాద్ రవీంద్ర భారతిలో పండుగ సాయన్న జయంతి వేడుకలు

- వివరాలు నమోదు కానివారు ప్రభుత్వానికి తెలియజేయాలని సూచన
- వచ్చే కేబినెట్‌లో కులగణన లెక్కలపై చర్చ
- ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే అంశాన్ని పరిశీలిస్తామని హామీ
- ముదిరాజ్ నాయకులకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామని హామీ
- పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాల ఏర్పాటుకు హామీ






బీసీ కులగణనలో తమ వివరాలు నమోదు కాలేదని భావించే వారు ముందుకొస్తే లెక్కలను సరిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అవసరమైతే బీసీ జనాభా లెక్కలను సవరించి, జాబితాలోకి రాని వారిని చేర్చుతామని స్పష్టం చేశారు. బీసీ వర్గాలకు సామాజిక న్యాయం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొని మాట్లాడారు. వందేళ్లలో ఎవరూ చేయని సాహసం తమ ప్రభుత్వం చేసిందని, ఏడాదిలోనే కులగణన పూర్తి చేసి తొలిసారిగా బీసీల జనాభా లెక్కలను తేల్చామని అన్నారు. ఏ కులం వారైనా తమ జనాభా తక్కువగా నమోదైందని భావిస్తే సంబంధిత వివరాలు అందించాలని సూచించారు. వచ్చే కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించి లెక్కలను మరింత పక్కాగా చేస్తామని వెల్లడించారు.

తనకు అవకాశం ఉంటే తన కుర్చీ చుట్టూ బలహీనవర్గాలను కూర్చోబెట్టుకోవాలన్నదే తన - మిగతా 2లో

### శతాబ్దం గడిచినా పండుగ సాయన్నను ప్రజలు గుర్తు పెట్టుకున్నారు: సీఎం రేవంత్

- పండుగ సాయన్న పోరాట స్ఫూర్తిని కొనియాడిన సీఎం రేవంత్‌రెడ్డి
- ముదిరాజులను బీసీ-ఏలో చేర్చే అంశంపై క్యాబినెట్‌లో చర్చిస్తామని వెల్లడి
- ముదిరాజులకు న్యాయం జరిగేలా చూడాలని మంత్రి పొన్నంకు బాధ్యతలు
- తెలంగాణలో కులగణనను ఆదర్శంగా నిలిపామని సీఎం వ్యాఖ్య

- మిగతా 2లో



# సౌదీ ఎయిర్‌పోర్ట్‌పై హౌతీల దాడి..

## భారతీయుడి సహా ఇద్దరి మృతి

- సౌదీలోని దమ్మామ్ విమానాశ్రయంపై హౌతీ తిరుగుబాటుదారుల దాడి
- ఈ ఘటనలో ఒక భారతీయుడు, ఒక సౌదీ పౌరుడు మృతి
- యెమెన్‌లో కాల్పుల విరమణ ఒప్పందం విఫలమవడంతో పెరిగిన దాడులు
- సౌదీ చమురు, పౌర సదుపాయాలపై దాడులు తీవ్రతరం చేసిన హౌతీలు
- ఎర్ర సముద్రంలో ఆయిల్ షిప్‌మెంట్లను కూడా అడ్డుకుంటున్న తిరుగుబాటుదారులు

వివరాలు 2లో..



## ఏపీలో మున్సిపల్ ఎన్నికలు నవంబర్ 1కి

# వాయిదా

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక ఎన్నికల పోలింగ్ వాయిదా పడింది. 99 పట్టణ, నగర సంస్థలకు నవంబర్ 1న పోలింగ్ జరగనుంది. నవంబర్ 3న ఫలితాలను వెల్లడిస్తారు. మైదుకూరు పోలింగ్ తేదీని ఈసీ ప్రకటించలేదు. మైదుకూరులో మళ్లీ నామినేషన్ల ప్రక్రియ, తర్వాతే

వివరాలు 2లో..

### ప్రకృతితో ఘర్షణ వద్దు..

# విపత్తులను తప్పించలేం



## 'అలయ్ బలయ్'లో వెంకయ్యనాయుడు

- హైదరాబాద్‌లో ఘనంగా జరిగిన అలయ్ బలయ్ వేడుకలు
- ప్రకృతితో మమేకమై జీవించాలని సూచించిన వెంకయ్యనాయుడు
- రాజకీయాలకు అతీతంగా హాజరైన వివిధ పార్టీల నేతలు
- 'నషా ముక్త్ భారత్ - వికసిత్ భారత్' ఇతివృత్తంతో కార్యక్రమం
- ఐక్యతను చాటిన సాంస్కృతిక సమ్మేళనమని వక్తల ప్రశంస

- మిగతా 2లో



### స్మిత్ మచ్చర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన..

# ప్రధాని మోదీకి నెతన్యాహు నుంచి ప్రత్యేక ఆహ్వానం

- ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ జ్యోతిని వెలిగించాలని పిలుపు
- భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో కలిసి పాల్గొనాలని విజ్ఞప్తి
- ఉగ్రవాదంపై నేలపైనా, గగనతలంలోనూ పోరాడుతున్నామన్న నేతలు
- పశ్చిమాసియాలో శాంతి స్థాపనపై ఇరు దేశాధినేతల చర్చలు

- మిగతా 2లో

# డిండికి నీటి తరలింపు ఆపండి

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పాలమూరు నేతల విజ్ఞప్తి

- డిండి ప్రాజెక్టుకు పాలమూరు నుంచి నీటి తరలింపును ఆపాలని విజ్ఞప్తి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సమావేశమైన మహబూబ్‌నగర్ నేతలు
- ప్రస్తుత విధానంతో పాలమూరు ఆయకట్టుకు నష్టం తప్పదని ఆందోళన
- ప్రత్యామ్నాయ మార్గంలో డిండికి నీరు సరఫరా చేయాలని సూచన

2లో





# మరో 30 ఏళ్లు మీకు అధికారం రాదు..

## రాహుల్‌పై అమిత్ షా ఫైర్

- నిరసనల వేళ విదేశీ పర్యటనకు వెళ్లిన రాహుల్‌పై అమిత్ షా తీవ్ర విమర్శలు
- మరో 30 ఏళ్ల పాటు కాంగ్రెస్‌కు అధికారం దక్కదని జోస్యం
- రాహుల్ విదేశీ పర్యటనలపై బీజేపీ నేతల వరుస ఆరోపణలు
- జార్జ్ సోరోస్ నుంచి క్లాసులు తీసుకునేందుకే రాహుల్ విదేశాలకు వెళ్లారన్న సంబిత్ పాత్రా
- నిరసనలు కాదు.. గెలిచిన చోట ప్రణాళికలు చూపాలని విపక్షాలకు షా హితవు

- మిగతా 2లో

## డిండికి నీటి తరలింపు ఆపండి

డిండి ప్రాజెక్టుకు పాలమూరు ప్రాంతం నుంచి నీటిని తరలించే ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సమావేశమై వారు తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ బృందంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సీనియర్ నేత జానా రెడ్డితో పాటు పలువురు స్థానిక ఎమ్మెల్యేలు ఉన్నారు.సుమారు గంటన్నర పాటు సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో, డిండి ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలను నేతలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తాము డిండి ప్రాజెక్టుకు నీటి సరఫరా చేయడాన్ని వ్యతిరేకించడం లేదని, అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరుల నుంచి నీటిని మళ్లిస్తే పాలమూరు ఆయకట్టుకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వారు వివరించారు. కావున, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా డిండి ప్రాజెక్టుకు నీటిని తరలించే అంశాన్ని పరిశీలించాలని వారు ప్రభుత్వానికి సూచించారు.పాలమూరు నేతలు వ్యక్తం చేసిన అభ్యంతరాలను, అభిప్రాయాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సావధానంగా ఆలకించారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో సమగ్రంగా సమీక్షించి, అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. తమ ప్రాంత ప్రయోజనాలను కాపాడాలన్న విజ్ఞప్తిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఈ సందర్భంగా నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు.

## మరో 30 ఏళ్లు మీకు అధికారం రాదు.. రాహుల్‌పై అమిత్ షా ఫైర్

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలో ఉండగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆయనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మరో మూడు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాదని జోస్యం చెప్పారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పై ఇండియా కూటమి దేశవ్యాప్త నిరసనలు చేపట్టిన తరుణంలో రాహుల్ విదేశాల్లో ఉండటాన్ని బీజేపీ లక్ష్యంగా చేసుకుంది.ఢిల్లీలో యమునా నది ప్రక్షాళనకు సంబంధించిన రూ.8,941 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించిన అనంతరం అమిత్ షా ప్రసంగించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "నేను మాట్లాడేది మీకు వినబడదని నాకు తెలుసు, మీరు ఎక్కడో విదేశాల్లో కూర్చున్నారు. ఎందుకు వెళ్లారో కూడా చెప్పరు, అది మీ వ్యక్తిగత విషయం.. కానీ ఢిల్లీకి తిరిగి వచ్చాక నా మాట వినండి, మరో 30 ఏళ్ల పాటు మీ వంతు రాదు" అని అమిత్ షా చురకలంటించారు. ప్రస్తుతం రాహుల్ గాంధీ నాలుగు రోజుల పర్యటన నిమిత్తం వియత్నాంలో ఉన్నట్లు సమాచారం.ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని, దీనిలో జ్ఞానేశ్ కుమార్ పాత్ర ఉందని ఆరోపిస్తూ ఇండియా కూటమి పార్టీలు ఆందోళనలు చేస్తున్న సమయంలో రాహుల్ విదేశీ పర్యటనకు వెళ్లడంపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఢిల్లీలో నిరసనల్లో అబద్ధాలు చెప్పి అలసిపోయి, రాహుల్ విహారయాత్రకు వెళ్లారని బీజేపీ ఎద్దేవా చేసింది. ఆయన వియత్నాం విమానంలో ఉన్నట్లుగా చెబుతున్న ఒక వీడియోను 'ఎక్స్'లో షేర్ చేస్తూ.. "రాహుల్ గాంధీ విదేశీ పర్యటనల వెనుక ఉన్న అజెండా ఏమిటి?" అని ప్రశ్నించింది.ఇదే అంశంపై బీజేపీ నేత సంబిత్ పాత్రా మాట్లాడుతూ.. పాలన మార్పునకు కుట్ర పన్నుతున్నారని, జార్జ్ సోరోస్ నుంచి క్లాసులు తీసుకోవడానికే రాహుల్ విదేశాలకు వెళ్లారని ఆరోపించారు. కాంగ్రెస్ నేత విరామం కోసం విదేశాలకు వెళుతున్నారా? లేక తన అరాచక సహాయకారులను కలవడానికి వెళుతున్నారా? అని మరో బీజేపీ నేత ప్రదీప్ భండారీ ప్రశ్నించారు.ఈ సందర్భంగా విపక్షాల ఓట్ల దొంగతనం ఆరోపణలను కూడా అమిత్ షా తిప్పికొట్టారు. చాలా రాష్ట్రాల్లో దశాబ్దాలుగా ప్రతిపక్షాలు అధికారంలో లేకుండా పోయాయని గుర్తుచేశారు. "నిరసనలు, ప్రదర్శనలతో ఏమీ సాధించలేరు. మీరు ఎక్కడైతే ఎన్నికయ్యారో అక్కడ ప్రజల కోసం ప్రణాళికలు తీసుకురండి" అని విపక్షాలకు హితవు పలికారు.

## సౌదీ ఎయిర్‌పోర్ట్‌పై హౌతీల దాడి.. భారతీయుడి సహా ఇద్దరి మృతి

సౌదీ అరేబియాపై యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు దాడులను మరింత తీవ్రతరం చేశారు. బుధవారం రాత్రి దమ్మామ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడిలో ఇద్దరు వ్యక్తులు మరణించగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారు. ఈ విషయాన్ని సౌదీ సివిల్ ఏవియేషన్ అథారిటీ నేడు ఒక ప్రకటనలో అధికారికంగా ధ్రువీకరించింది. మృతుల్లో ఒకరు సౌదీ పౌరుడు కాగా, మరొకరు భారతీయుడని అధికారులు తెలిపారు. దాడి కారణంగా విమానాశ్రయానికి జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు.గత కొన్ని వారాలుగా సౌదీ అరేబియాలోని చమురు క్షేత్రాలు, పౌర మౌలిక సదుపాయాలపై హౌతీల దాడులు తీవ్ర స్థాయిలో పెరిగాయి. ఈ దాడుల కారణంగా రియాద్‌లోని ప్రధాన విమానాశ్రయాన్ని మూసివేయడంతో పాటు సౌదీ ప్రభుత్వం ఓ కీలక పెట్టుబడుల సదస్సును కూడా వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేవలం ఈ నెలలోనే సౌదీ విమానాశ్రయాలపై జరిగిన వివిధ దాడుల్లో ఇప్పటివరకు మొత్తం 22 మంది మరణించినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.మరోవైపు ఎర్ర సముద్రంలో హౌతీలు మారిటైమ్ దిగ్బంధనం విధించడం కూడా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద ముడి చమురు ఎగుమతిదారు అయిన సౌదీ అరేబియా నుంచి వెళ్లే ఆయిల్ షిప్‌మెంట్లకు ఇది పెద్ద ముప్పుగా మారింది.

యెమెన్‌లో సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు, ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారుల మధ్య ఏళ్లుగా అంతర్యుద్ధం కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం గత జులైలో విఫలమైంది. అప్పటి నుంచి హౌతీలు దాడులను తీవ్రతరం చేశారు.

ఒప్పందం ముగిసిన తర్వాత సౌదీ నౌకలు, భూభాగాలు, చమురు క్షేత్రాలే లక్ష్యంగా దాడులు ప్రారంభించిన హౌతీలు, సెప్టెంబర్‌లో భారీ దాడికి దిగి ఎర్ర సముద్ర తీరంలోని పలు ప్రభుత్వ ఆధీన ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నారు. దీనికి ప్రతిగా హౌతీల నియంత్రణలో ఉన్న యెమెన్‌లోని పలు ప్రాంతాలపై సౌదీ వైమానిక దళం తరచూ వైమానిక దాడులు జరుపుతోంది. ఈ పరస్పర దాడులతో యెమెన్ సంక్షోభం మరింత తీవ్రమవుతోంది.

# బీసీ కులగణనలో తప్పులుంటే సరిచేస్తాం..

- మొదటి పేజి తరువాయి

ఆలోచన అని రేవంత్ రెడ్డి అన్నారు. ముదిరాజ్‌లను ప్రస్తుతం బీసీ-డీ జాబితా నుంచి బీసీ-ఏలోకి మార్చాలన్న డిమాండ్‌పైనా సీఎం స్పందించారు. ఈ అంశంపై ముదిరాజ్ నాయకులు న్యాయ నిపుణులను సంప్రదించి, ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. గంగపుత్రుల్లో ఉన్న అపోహలను కూడా తెలుసుకోవాలని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన పలువురికి పదవులు కల్పించామని, మిగిలిన నాయకులకు కూడా త్వరలో అవకాశాలు వస్తాయని హామీ ఇచ్చారు.తన పనితీరుపై మాట్లాడుతూ పరోక్షంగా గత సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారు. తనకు ఇంకా వయసు, ఓపిక ఉన్నాయని, తాను ఫామ్‌హౌస్‌లో పడుకునే రకాన్ని కాదని వ్యాఖ్యానించారు.పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు. పండుగ సాయన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న విగ్రహాలను ట్యాంక్‌బండ్ సమీపంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. బలహీనవర్గాలకు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# శతాబ్దం గడిచినా పండుగ సాయన్నను ప్రజలు గుర్తు పెట్టుకున్నారు: సీఎం రేవంత్

హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో పండుగ సాయన్న జయంతి వేడుకలు ఘనంగానిర్వహించింది తెలంగాణ ప్రభుత్వం. గురువారం ( అక్టోబర్ 22 ) నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు సీఎం రేవంత్. పండుగ సాయన్న జయంతిని గతంలో ఎవరూ అధికారికంగా నిర్వహించలేదని... కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే అధికారికంగా నిర్వహిస్తున్నామని అన్నారు సీఎం రేవంత్. శతాబ్దం గడిచినా పండుగ సాయన్న ప్రజలు గుర్తు పెట్టుకున్నారని అన్నారు.

కొడంగల్ లో అత్యధిక జనాభా ముదిరాజ్ లదే అని... ముదిరాజ్ లు అండగా ఉంటే ఏదైనా సాధిస్తామని తన నమ్మకమని అన్నారు సీఎం రేవంత్. జమీందార్లు, భూస్వాములకు వ్యతిరేకంగా పండుగ సాయన్న పోరాడారని.. ఒక దళాన్ని నిర్మించుకొని భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడారని...ఎన్నో అరాచకాలను ఎదురించి పేదలకు అండగా నిలిచారని అన్నారు. 40 ఏళ్ళు నిండకుండానే సాయన్నను ఉరి తీసారని అన్నారు.తెలంగాణలో కులగణన చేసి తమ ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఆదర్శంగా నిలిచిందని అన్నారు. కులగణనలో కుటుంబ వివరాలు లేకుంటే మళ్ళీ మీ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు సీఎం రేవంత్. మన కులాల లెక్కలు పక్కగా ఉండాలని.. ముదిరాజులను బీసీ ఏ లో చేర్చే అంశంపై క్యాబినెట్ లో చర్చిద్దామని అన్నారు. ఈ అంశంపై క్యాబినెట్ సబ్ కమిటీ కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు సీఎం రేవంత్. ముదిరాజులకు న్యాయం జరిగేలా చూడమని పొన్నంకు బాధ్యత ఇస్తున్నానని అన్నారు.తనకు వయస్సు, ఓపిక ఉందని.. ఫామ్ హౌజ్ లో పండుకోలేదని.. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు సీఎం రేవంత్. ఇందిరమ్మ ఇండ్లు ఉన్న ఊర్లలో ఓట్లు అడుగుతానని.. అక్కడే తనకు మెజారిటీ వస్తుందని అన్నారు సీఎం రేవంత్. గత ముఖ్యమంత్రులు ఇచ్చిన పథకాలను ఆపలేదని.. ప్రజలకు ఉపయోగపడే ప్రతి పథకాన్ని కొనసాగిస్తున్నామని అన్నారు.

# సమన్వయమే లక్ష్యంగా నేడు డీజీపీల సమావేశం

- మొదటి పేజి తరువాయి

పుదుచ్చేరి, లక్షద్వీప్‌ల డీజీపీలు, ఐజీలు, కేంద్ర ప్రభుత్వ ఇంటెలిజెన్స్ బ్యూరో, సీబీఐ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్, జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ), సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్), సీఆర్పీఎఫ్ అధికారులు కూడా పాల్గొననున్నట్లు చెప్పారు. అంతర్రాష్ట్ర నేరాల నియంత్రణకు ఉమ్మడి కార్యాచరణ రూపొందించడంపై ఈ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అంతర్రాష్ట్ర నేరగాళ్ల కదలికలు, సమాచారం

ఇచ్చిపుచ్చుకోవడం, దర్యాప్తులో ఎదురవుతున్న సమస్యలు, దేశవ్యాప్తంగా కొత్త క్రిమినల్ చట్టాల అమలు తీరు, తీరప్రాంతాల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, పోలీసింగ్‌లో ఏఐ అమలు వంటి వాటిని సమావేశ ఎజెండాలో పొందుపర్చినట్లు డీజీపీ వెల్లడించారు.

# వరంగల్ కోట అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్.. రూ. 382 కోట్లు మంజూరు

కాకతీయ వైభవానికి ప్రతీకగా నిలిచిన వరంగల్ కోట అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఖిల్లా వరంగల్‌తో పాటు హనుమకొండ నగరంలోని కీలక ప్రాంతాల్లో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనుల కోసం మొత్తం రూ. 382 కోట్ల కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ నిధులతో ఖిల్లా వరంగల్ పునరుద్ధరణ, సెంట్రల్ ప్లాజా నిర్మాణం, బస్ టెర్మినల్, వేయి స్తంభాల ఆలయం పరిసరాల అభివృద్ధి, మ్యూజికల్ గార్డెన్ వంటి కీలక ప్రాజెక్టులను చేపట్టనున్నారు. ఈ పనులన్నింటినీ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) పర్యవేక్షణలో నిర్వహించనుండగా, ప్రాజెక్టుల అమలుకు ప్రపంచ బ్యాంకు నిధులను వినియోగించనున్నారు. వరంగల్ ప్రాంతంలోని

చారిత్రక కట్టడాలు పరిరక్షణతో పాటు మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే విస్తృత ప్రయత్నాల్లో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టులు పూర్తయితే పర్యాటక రంగంలో వరంగల్ నగరానికి మరింత గుర్తింపు లభించడంతో పాటు, నగర రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని అధికారులు భావిస్తున్నారు.

## హైదరాబాద్‌లో ఘనంగా 'అలయ్ బలయ్'..

# అట్టహాసంగా వేడుకలు

హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏటా నిర్వహించే 'అలయ్ బలయ్' సాంస్కృతిక కార్యక్రమం ఈరోజు అట్టహాసంగా ప్రారంభమైంది. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఆయన కుమార్తె బండారు విజయలక్ష్మిల నేతృత్వంలో ఈ వేడుకలు జరుగుతున్నాయి. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను చాటిచెబుతూ, ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం.ప్రతి ఏటా దసరా తర్వాత కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఈ కార్యక్రమంలో తెలంగాణ జానపద కళారూపాలను ప్రదర్శిస్తున్నారు. బతుకమ్మ, బోనాలు, డప్పు, గుస్సాడీ, కోలాటం వంటి సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.ఈ ఏడాది 'నషా ముక్త్ భారత్' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. యువతలో మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కల్పించడమే దీని ప్రధాన లక్ష్యం.ఈ వేడుకలకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి

రాజ్‌నాథ్ సింగ్, తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా పలు పార్టీల నేతలు హాజరుకానున్నారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాల్లో రాణించిన వారిని సత్కరించనున్నారు. వచ్చిన అతిథుల కోసం తెలంగాణ సంప్రదాయ వంటకాలతో విందు ఏర్పాటు చేశారు. 2005లో దత్తాత్రేయ ప్రారంభించిన ఈ అలయ్ బలయ్, తెలంగాణ వారసత్వాన్ని జరుపుకొనే ఒక ప్రముఖ సామాజిక-సాంస్కృతిక వేడుకగా గుర్తింపు పొందింది.

## గడ్డం పెంచితే కేటీఆర్ సీఎం అయిపోతాడా?

నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గడ్డం పెంచుకుంటే ముఖ్యమంత్రి అవుతారని ఎవరో చెప్పడం వల్లే కేటీఆర్ ఆ పని చేస్తున్నారని, అయితే ఆయన గడ్డం పెరుగుతుందే తప్ప సీఎం మాత్రం కాలేరని ఎద్దేవా చేశారు. 2028 ఎన్నికల్లో తెలంగాణలో కాషాయ సునామీ ఖాయమని, బీజేపీ ఒంటరిగానే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకరినొకరు కాపాడుకుంటున్నాయని, ఈ రెండు పార్టీల మధ్య పొత్తు కోసం తెరవెనుక చర్చలు జరుగుతున్నాయని సంచలన ఆరోపణలు చేశారు. ఈ పొత్తుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కరే అడ్డంకిగా ఉన్నారని, ఆయనపై కాంగ్రెస్ అధిష్ఠానం అసంతృప్తితో ఉందని అన్నారు. బీఆర్ఎస్‌తో కుమ్మక్కై రేవంత్‌ను సీఎం పదవి నుంచి తొలగించేందుకు అధిష్ఠానం ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో బీజేపీ సైలెంట్‌గా ఉందన్న ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. రాజకీయ తుపాను సృష్టించేందుకు తెరవెనుక పనులు జరుగుతున్నాయని తెలిపారు. గతంలో కాంగ్రెస్ నేత ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా గడ్డం పెంచారని, ఆయన గడ్డం పెరిగింది కానీ కాంగ్రెస్ పార్టీ ఎదగలేకపోయిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేసే పరిస్థితి లేదని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఎవరితోనూ పొత్తు పెట్టుకోకుండానే విజయం సాధిస్తుందని అర్వింద్ స్పష్టం చేశారు.

## ప్రకృతితో ఘర్షణ వద్దు.. విపత్తులను తప్పించలేం

ప్రకృతితో సామరస్యంగా జీవించడం అత్యంత ఆవశ్యకమని, ప్రకృతి వైపరీత్యాలను నివారించడం సాధ్యం కాదని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'అలయ్ బలయ్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన గుర్తుచేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల మధ్య ఐక్యతను, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే గొప్ప వేదిక 'అలయ్ బలయ్' అని ఆయన కొనియాడారు.ప్రతి సంవత్సరం దసరా పండుగ అనంతరం హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సారథ్యంలో ఈ సాంస్కృతిక సమ్మేళనం జరుగుతోంది. ఈ వేడుకలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం సహా పలు రాజకీయ పార్టీల నేతలు పాల్గొని సమైక్యతను చాటారు. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేంద్ర

మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, లౌకిక దేశంలో ఏ మతాన్ని, పండుగను తక్కువ చేసి చూడకూడదని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్' సాధనను దేశ ప్రజలందరూ తమ ఉమ్మడి జాతీయ లక్ష్యంగా మలుచుకోవాలని బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. కులమతాలకు, రాజకీయాలకు, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ఈ కార్యక్రమం నిలుస్తుందని అలయ్ బలయ్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్, దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి తెలిపారు.'నషా ముక్త్ భారత్ - వికసిత్ భారత్' (మత్తుపదార్థాల రహిత - అభివృద్ధి చెందిన భారతదేశం) అనే ఇతివృత్తంతో ఈ ఏడాది అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే జానపద కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ఆహూతులను అలరించాయి.

## స్మిత్ మచ్చర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన..

## ప్రధాని మోదీకి నెతన్యాహు నుంచి ప్రత్యేక ఆహ్వానం

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఇజ్రాయెల్ నుంచి ఒక అరుదైన గౌరవం లభించింది. ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించే జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్వయంగా మోదీని ఆహ్వానించారు. భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో కలిసి ఈ జ్యోతిని వెలిగించాలని కోరడం ఈ ఆహ్వానంలోని విశేషం.గురువారం ఇరువురు నేతలు టెలిఫోన్ ద్వారా సంభాషించారు. ఈ సందర్భంగా నెతన్యాహు చేసిన ప్రతిపాదనకు ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలియజేశారు. భారత్, ఇజ్రాయెల్ దేశాలు ఉగ్రవాదంపై పోరాడుతున్నాయని మోదీ వ్యాఖ్యానించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది.గత సెప్టెంబర్‌లో దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళుతున్న 'ఫ్లైదుబాయ్' విమానంలో తన సహ పైలట్ జరిపిన దాడిని భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ వీరోచితంగా అడ్డుకున్నారు. తీవ్రంగా గాయపడినప్పటికీ, ఆయన అత్యంత చాకచక్యంగా వ్యవహరించి, దాడి చేసిన వ్యక్తిని సిబ్బందికి అప్పగించడమే కాకుండా విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. "ఇజ్రాయెల్, భారత్ సహా యావత్ ప్రపంచానికే ఆయన ఒక హీరో" అని నెతన్యాహు కొనియాడారు. ఆయన సాహసాన్ని గౌరవిస్తూ ఈ ఆహ్వానం పంపినట్లు పేర్కొన్నారు.ఈ సంభాషణలో భాగంగా ఇరు దేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఇరువురు నేతలు పునరుద్ఘాటించారు. పశ్చిమాసియాలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులు, అక్కడ శాంతి, స్థిరత్వం నెలకొల్పాల్సిన ఆవశ్యకతపై చర్చించారు. చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే ఏ సమస్యకైనా పరిష్కారం లభిస్తుందని ప్రధాని మోదీ ఈ సందర్భంగా నొక్కిచెప్పారు.

# పేదల పక్షాన నిలిచి పోరాడిన ప్రజా నాయకుడు పండుగ సాయన్న.... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

## కలెక్టరేట్‌లో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు





**ఖమ్మం ప్రతినిధి: అక్టోబర్, 22:** పేద ప్రజల పక్షాన నిలిచి, అణగారిన వర్గాల కోసం పోరాడిన ప్రజా నాయకుడు పండుగ సాయన్న అని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.గురువారం పండుగ సాయన్న జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో వారి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.జిల్లాకలెక్టర్ దివాకర టి ఎస్ మాట్లాడుతూ ప్రజలను దోపిడీ చేస్తున్న భూస్వాములకు, దొరలకు వ్యతిరేకంగా పండుగ సాయన్న పోరాటం చేశారని తెలిపారు. పండుగ సాయన్న కేవలం సంపన్నుల నుంచి ఆస్తులను తీసుకొని పేదలకు పంచి పెట్టడానికే పరిమితం కాకుండా, ఆనాటి పాలనలోని అధికార వ్యవస్థను ప్రశ్నించి, అధికారులను ఎదిరించారని తెలిపారు. తనదైన పాలనా వ్యవస్థను ఏర్పాటు చేసుకొని, సమాజంలో అణగారిన వర్గాలకు న్యాయం జరిగేలా ప్రయత్నించారని వివరించారు. ప్రజల కోసం పోరాడిన పండుగ సాయన్న జీవితం, ధైర్యసాహసాలు తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజల కోసం పోరాడిన మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, అధికారులు, కుల సంఘ నాయకులు ములకలపల్లి సంగమేశ్వర రావు, పిట్టల వెంకట నరసయ్య, రావుల హనుమంతరావు, అనంత రాములు, బైరు హరినాథ బాబు, లింగబోయిన లక్ష్మణ్, పిట్టల నాగేశ్వరరావు ముదిరాజ్, గోల్కొండ అంజయ్య, కొప్పెర జానకి రామయ్య, పొన్నెబోయిన స్వామి, సుంకర శ్రీనివాసరావు, నార్ల శేషయ్య, మామిడి వెంకటేశ్వర్లు, మేడారం వెంకటేశ్వర్లు, కొప్పెర ఉపేందర్, పొదగంటి రాంబాబు, మేకల సుగుణరావు, భద్ర నాయక్, తదితరులు పాల్గొన్నారు








# బీసీలకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి







- నామినేటెడ్ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలి
- విలేకరుల సమావేశంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు పొదిల సతీష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి యలమందల జగదీష్

**ఖమ్మం ప్రతినిధి: అక్టోబర్, 22:** ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గవర్నర్ కోటాలో డాక్టర్ లోకేష్ యాదవ్ ఇవ్వాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు పొదిల సతీష్ యాదవ్, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి, నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఖమ్మం నగర అధ్యక్షులు యలమందల జగదీష్ పేర్కొన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వారు మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలోనూ , ఎన్ఎస్ యుఐ విద్యార్థి సంఘం నాయకుడు నుండి రాష్ట్ర అధికార ప్రతినిధి గా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి పాటుపడిన లోకేష్ యాదవ్, నాయి బ్రాహ్మణ బిడ్డ జంపాల రాజేష్ లకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం లేకపోతే తమ గోడు ఎవరికి చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. 2014, 2018, 2023 ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, రాజ్యసభ, మంత్రి పదవి కూడా ఒక్క బీసీకి కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల జనాభా శాతం ఎక్కువగా ఉన్నా చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం కరువైందని పేర్కొన్నారు. ఓట్లు మావి సీట్లు మీవా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీసీలకు న్యాయం చేయాలని లేనిచో రాష్ట్రవ్యాప్తంగా బీసీల ఉద్యమానికి శ్రీకారం చుడతామని పేర్కొన్నారు. ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికలలో నాయి బ్రాహ్మణులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బత్తుల వీరబాబు, పగడాల హనుమంతరావు, రాగం కోటి, నాగరాజు, వినయ్, వంశి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ వద్దిరాజు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు

**ఖమ్మం ప్రతినిధి: అక్టోబర్, 22:**రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావును కలిసి దసరా పండుగ సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఎంపీ రవిచంద్ర పార్టీ కార్యనిర్వహక అధ్యక్షులు, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కే.టీ.రామారావును హైదరాబాద్ తెలంగాణ భవన్ లో గురువారం మధ్యాహ్నం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమిచ్చి శాలువాతో సత్కరించి దసరా శుభాకాంక్షలు చెప్పారు.అలాగే, ఎంపీ రవిచంద్రతో పాటు బొగ్గు గని కార్మిక సంఘం ముఖ్య ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ, నాయకులు వీరభద్రం,ఊకంటి ప్రభాకర్ రావు,జీ.కే.సంపత్ కుమార్,నాగెల్లి వెంకటేశ్వర్లు,గడప రాజయ్య తదితరులు కేటీఆర్ కు పుష్పగుచ్ఛం అందజేసి దసరా సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



# ఆదివాసీ యోధుడు కుమ్రం భీంకు ఘన నివాళులు- ఎర్రబోడు మాజీ సర్పంచ్ “కురసం సత్యనారాయణ”



**కారేపల్లి: అక్టోబర్, 22:**ఆదివాసీల ఆత్మగౌరవం, న్యాయమైన హక్కుల సాధనకు పోరాడిన విప్లవ సూర్యుడు కుమ్రం భీం జయంతి సందర్భంగా ఆయనకు ఎర్రబోడు మాజీ సర్పంచ్ కురసం సత్యనారాయణ ఘనంగా నివాళులర్పించారు.”జల్ జంగిల్ జమీన్”అని నినదిస్తూ ఆదివాసీ ప్రజల న్యాయమైన హక్కుల కోసం, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరుసల్పిన గోండు బొబ్బిలిపులి భీం అని కురుసం సత్యనారాయణ తన సందేశంలో పేర్కొన్నారు.పీడిత తాడిత ప్రజల పక్షాన పోరాడిన ధీరుడు భీం కుమ్రం భీం ముందుకు సాగాలని గుర్తు చేశారు.

# రాము-మమతల నిశ్చితార్థ వేడుకలో పాల్గొని ఆశీర్వదించిన సర్పంచ్ గుగులోత్ కృష్ణ నాయక్



ఆత్మకూర్ (స్ )మండలం కర్రోని తండా లో జరిగిన బక్క హేమ్లాతండా గ్రామపంచాయతీ కేతావత్ లింగ -భారతి గారి కుమారుడు రాము - మమత గారి ఎంగేజ్మెంట్ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన బక్క హేమ్లాతండా గ్రామ సర్పంచ్ గుగులోత్ కృష్ణ నాయక్ గారు ఈ కార్యక్రమం లొ గ్రామ శాఖ అధ్యక్షులు కేతావత్ మంగత్య నాయక్, గుగులోత్ సోమ్లా నాయక్, కేతావత్ వెంక నాయక్, మూడ్ చందు నాయక్, గుగులోత్ యాదగిరి నాయక్, గుగులోత్ మన్సింగ్ నాయక్, మూడ్ వీరన్న నాయక్, గుగులోత్ లచ్చు నాయక్, మూడ్ రవి నాయక్,తుంగతుర్తి నియోజకవర్గ టీపీసీసీ సోష ల్ మీడియా మూడ్ మోహన్ నాయక్ కేతావత్ మోహన్ నాయక్, మూడ్ సుమన్ నాయక్,తదితరులు పాల్గొన్నారు

# కొమరం భీమ్ స్ఫూర్తితో ముందుకెళ్దాం - గుగులోత్ కిషన్ నాయక్..





**మహబూబాబాద్: అక్టోబర్, 22:** కొమరం భీం ఆశయాలతో ముందడుగు. స్ఫూర్తితో వెళ్దాం వేద్దాం. ఆదివాసి గిరిజన హక్కుల కోసం పోరాటం చేయాలి, గిరిజన సామాజిక చైతన్య వేదిక గుగులోత్ కిషన్ నాయక్, గురువారం మహబూబాబాద్ పట్టణంలోని కొమరం భీం విగ్రహం సమీపంలో కొమరం విగ్రహం వద్ద ఆదివాసి హక్కుల పోరాట యోధుడు జల్ జంగిల్ జమీన్ పోరాట స్ఫూర్తి దాత కొమరం భీమ్ జయంతి సందర్భంగా దళిత గిరిజన విద్యార్థి ప్రజా సంఘాల సారథ్యంలో కొమరం విగ్రహానికి ఘనంగా నివాళులర్పించి ఘనంగా చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో కిషన్ నాయక్ మాట్లాడుతూ గిరిజన హక్కులు చట్టాలు పిసా చట్టం, వన్ ఆఫ్ సెవెంటీ చట్టం, అడవి హక్కుల చట్టం, ఐదు ఆరు, షెడ్యూల్లో ప్రత్యేక చట్టాలను అమలు కోసం కొమరం భీమ్ స్ఫూర్తితో గిరిజన హక్కుల కోసం పోరాటానికి ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని కిషన్ నాయక్ పిలుపునిచ్చారు అడవిలో ఉన్న ఆదివాసులను అడవిలో ఉన్న ఖనిజాల పేరిట కార్పొరేట్ సంస్థలకు అడవిలో ధారవత్తం చేయడం అడవిలో ఉన్న ఆదివాసులను మానవ హోమం చేయడం అడవి నుండి తరివేయడం వారి ఆదివాసులను నిరాస్త్రులుగా చేయడం సిగ్గుచేటని అన్నారు సర్వహక్కులు అడవిలో ఉన్న ఆదివాసులనని ఈ వ్యవస్థకు ఈ సమాజానికి ఆక్సిజన్ లాంటి ఆదివాసులను అనడం బాధాకరమని వెంటనే ఆదివాసీలో మీద జరుగుతున్న దాడులను అత్యాచారాలను ఆపాలని ఆదివాసి చట్టాలను అమలు జరపాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో సేవలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు వెంకన్న నాయక్, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చాగంటి ప్రభాకర్, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాపట్ల వీరన్న, ఎంఆర్పిఎస్ రాష్ట్ర కార్యదర్శి దుంపల్లి అనిల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు దేవత్ హేమానాయక్, ఎన్ హెచ్ పి ఎస్, కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మంగీలాల్ నాయక్, విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు పోలేపాక వెంకన్న, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు నాయక్, సేవాలాల్ సేన జాతీయ కోర్ కమిటీ నాయకులు మోతిలాల్ నాయక్, సుమలత పద్మ శ్రీలత తదితరులు పాల్గొని కొమరం భీం టు ఘనంగా నివాళులర్పించడం జరిగింది...గిరిజన హక్కుల కోసం కొమరం భీమ్ స్ఫూర్తితో పోరాటం చేయాలి, గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు గూగులోతు కిషన్ నాయక్ పిలుపునిచ్చారు.

# తెలంగాణలో కరువు మండలాలను ప్రకటించాలి

**పంట నష్టపరిహారం ఎకరాకు రూ.25వేలు ఇవ్వాలి**

**ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి మట్టపల్లి అంజయ్య**



**అనంతగిరి అక్టోబర్ 22 (ఆర్యాద్వి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కరువు ప్రాంతాలుగా ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్)తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది.ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కా॥మట్టపల్లి అంజయ్య బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.ఆయన మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం,బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడకపోవడం వలన ఈ సంవత్సరం తెలంగాణలో సగటు వర్షపాతం కంటే దాదాపు 23% తక్కువ వర్షపాతం నమోదైందన్నారు.దీంతో రాష్ట్రంలోని 18జిల్లాల్లో 320మండలాలు పరిధిలోని 12760గ్రామాల్లో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని,వీటిలో 11479గ్రామాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదై పంటలు ఎండిపోయాయని తెలిపారు.దాదాపు 12లక్షల ఎకరాల పంట నష్టం వాటిల్లిందని,బోర్లు,బావులు ఎండిపోగా తాగునీటికి,వ్యవసాయానికి నీరు లేక రైతులు,కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.ఇప్పటివరకు ప్రభుత్వం నుండి ఎటువంటి కరువు సహాయక చర్యలు లేకపోవడం ఆందోళనకరమన్నారు.నిత్యం 3నుండి 5గంటల వరకు విద్యుత్ కోతలు కోనసాగుతుండగా రైతులు పంటలకు నీరు పెట్టలేని పరిస్థితి నెలకొందన్నారు.ఇదే పరిస్థితి కొనసాగితే 7635కోట్ల కరెంట్ బిల్లులను ప్రభుత్వం నుండి వలస ఇప్పటికే నష్టాల్లో ఉన్న రైతులంపై పంపు పెట్టబడి వ్యయం పెరిగి,దిగుబడి పడిపోయి,ఉన్న దిగుబడి పడిపోయి రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారన్నారు.వెంటనే తెలంగాణ ప్రభుత్వం ప్రభావిత 18జిల్లాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులకు సంట నష్టపరిహారం ఎకరాకు కనీసం రూ.25,000/-చొప్పున అందించాలన్నారు.రైలీలకు ఉపాధి కూలీ పనులు కల్పించాలని,పశువులకు మేత,తాగునీరు సరఫరా ఏర్పాటు చేయాలని,విద్యుత్ కోతలను,రైతులపై మోపే నివారించి వ్యవసాయానికి నిరంతరాయంగా 9గంటల ఉచిత విద్యుత్ సరఫరా,భారీల సెంపును బేషరతుగా నిర్మించుకోవాలని డిమాండ్ చేశారు.సంట నష్టపోయిన రైతుల సంట రుణాలు వడ్డీ కొనరారా రుణాలు వడ్డీ రహితంగా రీషెడ్యూల్ చేసి రికవరీలను నిలుపుదల చేయాలని కోరారు.ఈ డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్)ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం చేయబడునని హెచ్చరించారు.

# కోదాడలో ఘనంగా అమిత్ షా జన్మదిన వేడుకలు





**కోదాడ అక్టోబర్ 22 (ఆర్యాద్వి):**సూర్యాపేట జిల్లా, కోదాడ: పట్టణంలోని రంగా థియేటర్ చౌరస్తాలో బీజేపీ యువ నాయకుడు ఏపూరి సత్యరాజు మాదిగ ఆధ్వర్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సూర్యాపేట జిల్లా ప్రవాస్ కన్వీనర్ జల్లా జనార్ధన్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అమిత్ షా దేశ ఐక్యత, భద్రత కోసం నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ పార్టీ అభివృద్ధిలో, దేశ రాజకీయాల్లో అమిత్ షా అందిస్తున్న సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కోదుమూరు ప్రవీణ్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కట్ట కోజు నాగేంద్ర చారి, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి పిడతల శంకర్, బీజేపీ సీనియర్ నాయకులు మొనగాల శీను, కోదాడ పట్టణ ప్రధాన కార్యదర్శి పైడిమరి సతీష్, కోశాధికారి యాదా కిరణ్, జనసేన కోదాడ నియోజకవర్గ నాయకుడు పసుపులేటి రామారావు, బీజేపీ నాయకులు బడావత్ రమేష్ నాయక్, ఉపేందర్ చారి, కనకాచారి, సంపేట భాగ్యరాజు, కందిబండ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల విద్యాప్రదాత ఎస్ఆర్ శంకరన్

**గురుకుల విద్యా వ్యవస్థకు పునాది వేసిన దార్శనికుడు..**

**ఉచిత విద్య, వసతి, సమాన అవకాశాల కల్పనలో ఎస్.ఆర్ శంకరన్ సేవలు చిరస్మరణీయం**

**స్వేరోస్ జిల్లా అధ్యక్షులు కోండ్రు రామచంద్రు**



**ఖమ్మం ప్రతినిధి : అక్టోబర్, 22:** పేద విద్యార్థుల విద్యాప్రదాత ఎస్.ఆర్ శంకరన్ అని, ఉచిత విద్య, వసతి, సమాన అవకాశాల కల్పనలో ఆయన సేవలు చిరస్మరణీయమని స్వేరోస్ జిల్లా అధ్యక్షులు కోండ్రు రామచంద్రు అన్నారు.ఖమ్మం నగరంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద గురువారం ఎస్.ఆర్ శంకరన్ 92వ జయంతి, స్వేరోస్ డే లను పురస్కరించుకొని స్వేరోస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎస్.ఆర్ శంకరన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాం సుందర్ తో కలసి స్వేరోస్ జిల్లా అధ్యక్షులు కోండ్రు రామచంద్రు స్వేరోస్ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సీనియర్ స్వేరోస్ నాయకులు మాట్లాడుతూ.. సమాజంలో పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదు.. కులం, ఆర్థిక స్థితిగతులు, సామాజిక వివక్ష పిల్లల భవిష్యత్తుకు అడ్డంకులు కావద్దు.. పేద కుటుంబాల్లో పుట్టిన పిల్లలు కూడా ఉన్నత విద్యను అభ్యసించి గౌరవప్రదమైన జీవితాన్ని సాధించాలనే ఆశయాలతో తన జీవితాన్ని సామాజిక సేవకు అంకితం చేసిన గొప్ప పరిపాలనా దార్శనికుడు డాక్టర్ ఎస్.ఆర్ శంకరన్ అని కొనియాడారు. ప్రభుత్వ పదవిని అధికార ప్రదర్శనకు కాకుండా అణగారిన వర్గాల అభ్యున్నతికి ఉపయోగించిన ఆయనను ప్రజలు ప్రేమతో 'పేదల ఐఏఎస్ అధికారి'గా గుర్తుచేసుకుంటున్నారన్నారు. డాక్టర్ ఎస్.ఆర్ శంకరన్ 1934 అక్టోబర్ 22న జన్మించారని అన్నారు. ఆయన 92వ జయంతి సందర్భంగా విద్య, సామాజిక న్యాయం, పేదల సంక్షేమం కోసం చేసిన ఎస్.ఆర్ శంకరన్ సేవలను స్మరించుకోవడం సమాజానికి ఎంతో అవసరం అన్నారు. పేద కుటుంబాలకు చెందిన పిల్లలు ప్రైవేటు పాఠశాలల్లో చదివే స్థోమత లేక నాణ్యమైన విద్యకు దూరమవుతున్న పరిస్థితులను మార్చేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1984లో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల అభివృద్ధికి శంకరన్ కృషి చేశారన్నారు.
పేదల కన్నీళ్లు తుడవడమే నిజమైన ప్రజాసేవగా భావించిన ఎస్.ఆర్. శంకరన్ జీవితం.. విద్యను హక్కుగా చూడాలని, సంక్షేమాన్ని సామాజిక బాధ్యతగా అమలు చేయాలని నేటి సమాజానికి చాటి చెబుతోంది. ఈ కార్యక్రమంలో సీనియర్ స్వేరోస్ నాయకులు పోలేపొంగు ఆంజనేయులు, మోదుగు నాగేశ్వరావు, కలకోట సంపత్, పిడమర్తి వెంకటేశ్వర్లు, శీలం ప్రసాద్, మందుల వెంకన్న, బండ్ల నాగేశ్వరరావు, డాక్టర్ పిసి వీరస్వామి, వంగూరి దశరద్, మేకల భాస్కర్, మందుల రమేష్, అప్పారావు, గౌతమ్, చిట్టీబాబు, మహేష్, గద్దల నాగరాజు, గుజ్జు కృష్ణ, మోదుగు నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల అక్రమాలపై బిఆర్ఎస్,వామపక్షాల గర్జన..





- ముట్టడితో దద్దరిల్లిన ఖమ్మం కలెక్టరేట్
- ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలి
- లాటరీ పద్ధతిలో బిఆర్ఎస్, వామపక్షాల డిమాండ్..

ఖమ్మం ప్రతినిధి: అక్టోబర్, 22: చట్ట బద్దత లేని ఇందిరమ్మ కమిటీలు రద్దు చేయాలి : నున్నా

ఈ సందర్భంగా సిపిఐ (ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజాపాలన పేరుతో లబ్ధిదారులను ఎంపిక చేసినా, ఇందిరమ్మ కమిటీలను రాజకీయాలకు అతీతంగా వేస్తామని చెప్పి ఏ గ్రామంలోనూ కాంగ్రెస్ వారు కాకుండా ఇంకెవరికీ చోటు ఇవ్వలేదని మండిపడ్డారు.

**ప్రభుత్వానికి కన్నువిప్పు కలిగించేలా పోరాటం : సండ్ర**

మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఇందిరమ్మ కమిటీల రద్దు, న్యాయమైన లబ్ధిదారుల ఎంపిక కోసం చేపట్టిన ఈ పోరాటం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వానికి కన్నువిప్పు కలిగించేలా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుంటేనే ఇళ్లు ఇస్తామని బెదిరింపులకు దిగుతున్నారని, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వయంగా ఈ రకమైన రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.
?దేశవ్యాప్తంగా రాజ్యాంగం పుస్తకం చేతపట్టుకుని తిరిగే కాంగ్రెస్ నాయకులకు, రాహుల్ గాంధీకి తెలంగాణలోని నిరుపేదల రాజ్యాంగ హక్కులు కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో కఠినమైన నిబంధనలు అమలు చేసి పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు జరిగిందన్నారు.

**ఇందిరమ్మ ఇండ్ల పథకం విఫలం**

సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సీవై పుల్లయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 వాగ్దానాలలో అన్ని వాగ్దానాలు విఫలమయ్యాయని,, ఇందిరమ్మ ఇండ్ల పథకం కూడా విఫలమైందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించిన రేవంత్ రెడ్డి, నేడు అధికారంలోకి వచ్చాక చేసిన పాలనలో కూడా నైతికత లేదని, ఆయన ప్రభుత్వం కూడా నూటికి నూరు శాతం విఫలమై ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్నదని తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమం లో సీపీఎం నాయకులు యర్రా శ్రీనివాసరావు,బండి రమేష్, పొన్నం వెంకటేశ్వరరావు, కళ్యాణం వెంకటేశ్వరరావు, మాదినేని రమేష్, బొంతు రాంబాబు తో పాటు ఇతర వామ పక్ష పార్టీల నేతలు, బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

**కలెక్టర్ కు వినతిపత్రం**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ ను అఖిల పక్ష నాయకులు కలిసి ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అక్రమాలు, రాజకీయ వివక్ష ను వివరించి, వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమం లో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు బండి రమేష్, యర్రా శ్రీనివాసరావు, పొన్నం వెంకటేశ్వరరావు, కళ్యాణం వెంకటేశ్వరరావు,బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు,మాజీ ఎమ్మెల్యే లు సండ్ర వెంకట వీరయ్య, కందాల ఉపేందర్ రెడ్డి తో పాటు సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి సీ వై పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు







# యాంటీ బీజేపీ స్టాండ్ తో వైసీపీ




**విశాఖపట్టణం అక్టోబరు 22, :**
వైసీపీ వచ్చే పార్లమెంటు సమావేశాల్లో గళం విప్పనుందని తెలుస్తోంది. వైసీపీ ధినేత వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలు కొంత కలకలం రేపుతున్నాయి. తాము కేంద్ర ఎన్నికల కమిషన్ నియామకంలో ఎన్డీఏప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు మద్దతిచ్చి తప్పు చేశామని జగన్ చెప్పడాన్ని బట్టి ఇక ఢిల్లీపై పోరుకు జగన్ సిద్ధమయినట్లు కనిపిస్తుంది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్డీయే నేతృత్వంలోని బీజేపీప్రభుత్వానికి గతంలో కొన్ని బిల్లుల విషయంలో మద్దతు ఇవ్వడంపై విచారం వ్యక్తం చేశారు. అయితే, ఆయన నేరుగా బీజేపీకి క్షమాపణలు చెప్పలేదు, కానీ కేంద్ర ఎన్నికల కమిషనర్ల నియామకబిల్లు-2023 విషయంలో నాడు ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతు ఇచ్చి పెద్ద తప్పు చేశామని వ్యాఖ్యానించారు. దీంతో వైసీపీకి, బీజేపీకి ఇప్పుడు మరింత దూరం పెరిగిందని చెప్పొచ్చు. పార్టీ 2024ఎన్నికలలో ఓటమి పాలయినా జగన్ పార్టీ బీజేపీలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి బిల్లుకు మద్దతిచ్చింది. 2023లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్నికల కమిషనర్ల నియామక సవరణ బిల్లుకు తాము మద్దతు ఇవ్వడం పొరపాటని జగన్ అభిప్రాయపడ్డారు. ఈ బిల్లు ద్వారా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ని నియామక కమిటీ నుంచి తొలగించి, ఆ స్థానంలో కేంద్ర మంత్రిని చేర్చారు. దీనికివైఎస్సార్‌సీపీ మద్దతు ప్రకటించింది. ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం పనితీరుపై, ఓటర్ల జాబితాల సవరణపై దేశవ్యాప్తంగా వస్తున్న ఆరోపణల నేపథ్యంలో జగన్ స్పందించారు. రాజ్యాంగబద్ధమైన సంస్థలపై
ప్రజల్లో నమ్మకం కలగాలంటే మళ్లీ పాత నియామక పద్ధతినే సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ కమిటీలో ఉండేలా పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. తాము గతంలో కేంద్రానికి కేవలం అంశాల వారీగామాత్రమే మద్దతు ఇచ్చామని, అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకం కలిగించాల్సిన అవసరం ఉందని వైసీపీ నేతలు స్పష్టం చేస్తున్నారు.... అయితే జగన్ కాంగ్రెస్‌నేతృత్వం వహిస్తున్న ఇండియా కూటమిలో భాగస్వామిగా మారతారని మాత్రం అనుకోవడానికి వీలులేదు. ఎందుకంటే కాంగ్రెస్ జగన్ కు ప్రధాన శత్రువు. అందుకే దానికి దూరంగా ఉండే అవకాశాలే ఎక్కువఉన్నాయి. అలాగని బీజేపీకి కూడా దగ్గరయ్యే ఛాన్సులు లేవు. ప్రస్తుతం పార్లమెంటులో ఏదైనా కీలకమైన బిల్లుల విషయంలో జగన్ పార్టీ ఇటు మద్దతు, అటు వ్యతిరేకత తెలపకుండా వాకౌట్ చేసేఅవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరొకవైపు తమిళనాడుకు చెందిన డీఎంకే పార్టీ బీజేపీ, కాంగ్రెస్ కు వ్యతిరేకంగా తృతీయ కూటమిని ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ఉంది. అందులో భాగంగా జగన్ తో డీఎంకే నేతలు సంప్రదింపులు జరిపితే కొంత వరకూ ఆ కూటమిలో చేరే అవకాశముంది. మొత్తం మీద జగన్ దారి ఎటన్నది రాజకీయంగా చర్చనీయాంశమైంది. రానున్న
కాలంలో దీనిపై పూర్తి స్థాయిలో క్లారిటీ రానుంది.రాజకీయా

# వైసీపీ 'సెల్ఫ్ గోల్' వ్యూహం !

**విజయవాడ, అక్టోబరు 22, :**
విజయవాడ మేయర్ ఎన్నికల పోరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న వ్యూహం ఆ పార్టీ ఉనికిని ప్రశ్నార్థకం చేసేలా ఉంది. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిలో ఎలాగైనా చిచ్చు పెట్టాలనే కుతంత్రంతో..ఎన్నికల బరిలో ఉన్న మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకి వైసీపీ సోషల్ మీడియా, ద్వితీయ శ్రేణి నేతలు పరోక్షంగా పూర్తి మద్దతు ప్రకటిస్తూ ప్రచారం సాగిస్తున్నారు. ఈ ఎన్నికను ఎప్పటిలాగే
పాత సామాజిక సమీకరణాలైన కమ్మ వర్సెస్ కాపు పోరుగా మార్చేయాలని చూస్తూ, ప్రధాన పోటీ వంగవీటి వర్సెస్ ఏబీవీ అన్నట్లుగా ఒక కృత్రిమ వాతావరణాన్ని సృష్టించేందుకు తాపత్రయపడుతున్నారు.కూటమి ఐక్యతను దెబ్బతీసి, కాపు-కమ్మ ఓట్లను చీల్చడం ద్వారా కూటమిలో రాజకీయ అగాధాన్ని సృష్టించాలనే కుయుక్తితోనే వైసీపీ ఈ పరోక్ష ప్రచారానికి తెరతీసింది.ఈ వికృత రాజకీయం నడుపుతున్న
క్రమంలో వైసీపీ నాయకత్వం ఒక కీలకమైన ప్రాథమిక వాస్తవాన్ని పూర్తిగా విస్మరిస్తోంది. బరిలో స్వయంగా తమ పార్టీ తరఫున అధికారిక అభ్యర్థి ఒకరు పోటీలో ఉన్నారన్న సంగతినే తాడేపల్లి వర్గాలుగాలికొదిలేశాయి. సొంత అభ్యర్థి గెలుపు కోసం వ్యూహాలు రచించి, క్షేత్రస్థాయిలో పార్టీ ఓటర్లను ఏకం చేయాల్సిన వైసీపీ.. ప్రత్యర్థి కూటమిని దెబ్బకొట్టే ఏకైక అజెండాతో స్వతంత్రంగా బరిలో ఉన్న ఏబీవీనిభుజానకెత్తుకోవడం వారి రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనం. గతంలో తమ ప్రభుత్వ హయాంలో ఏబీ వెంకటేశ్వరరావుపై తప్పుడు కేసులు బనాయించి, నిరంతరం వేధించిన వైసీపీ నేతలే.. నేడు
రాజకీయ ప్రయోజనాల కోసం ఆయనకు అనుకూలంగా నెరేటివ్ నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నారు.క్షేత్రస్థాయి రాజకీయ సమీకరణాలను నిశితంగా పరిశీలిస్తే.. వైసీపీ పన్నిన ఈ వల చివరకు వారికేఉచ్చుగా మారే స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. కూటమి వర్గాల్లో కమ్మ, కాపు సామాజిక వర్గాలతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ ఓటర్లంతా పూర్తి సమన్వయంతో కూటమి అభ్యర్థి వంగవీటి వెంటే ఏకతాటిపై నిలబడుతున్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ఓటు బ్యాంకు అత్యంత పటిష్టంగా ఉండటంతో.. ఎంతటి కుల రాజకీయాలు రేపినా కూటమి ఓట్లలో చీలిక తెచ్చే అవకాశమే లేదనితేలిపోయింది. కానీ, వైసీపీ చేస్తున్న పరోక్ష ప్రచారం వల్ల ఆ పార్టీకి చెందిన సంప్రదాయ ఓటర్లు, క్యాడర్ తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు.సొంత పార్టీ నాయకత్వమే పరోక్షంగా ఏబీవీకి ప్రాధాన్యంఇస్తుండటంతో.. వైసీపీ అభ్యర్థిపై నమ్మకం కోల్పోయిన ఆ పార్టీ కేడర్, ద్వితీయ శ్రేణి ఓటర్లు వైసీపీని కాదని నేరుగా ఏబీవీ వైపు మళ్లే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అంటే కూటమి ఓట్లను చీల్చాలనుకున్న వైసీపీ పన్నాగం బూమరాంగ్ అయి.. చివరకు వైసీపీ సొంత ఓటు బ్యాంకే ఏబీవీ ఖాతాలోకి వెళ్లి, ఆ పార్టీ అభ్యర్థి డిపాజిట్ కూడా గల్లంతయ్యే దుస్థితి దాపురిస్తోంది. కూటమి ఓట్లన్నీసంపూర్ణంగా వంగవీటికే దక్కనుండగా.. ఇటు వైసీపీ ఓట్లు రెండుగా చీలిపోయి, ఏబీవీకి దక్కే పరోక్ష మద్దతుతో వైసీపీ సొంత చేతులతోనే తన గొయ్యి తాను తవ్వుకుంటున్న సెల్ఫ్ గోల్ వ్యవహారంగా మారుతోంది.

# సిక్కోలులో విచిత్రం...టీడీపీ అభ్యర్థే..వైసీపీ మేయర్




**శ్రీకాకుళం, అక్టోబరు 22,**
శ్రీకాకుళం టీడీపీ నేత గుండా లక్ష్మి దేవి పార్టీకి రాజీనామా చేశారు. మాజీ ఎమ్మెల్యే అయిన ఆమెకు గత ఎన్నికల్లో టిక్కెట్ నిరాకరించారు. కూటమి ప్రభుత్వంలో తను ఆశించిన ప్రాధాన్యత దక్కకపోవడం,పొత్తులో భాగంగా మేయర్ స్థానాన్ని జనసేనకు కేటాయించడంతో అసంతృప్తికి గురయ్యారు. అదే సమయంలో వైసీపీ నుంచి ఆమెకు మేయర్ ఆఫర్ వచ్చింది. మేయర్ టిక్కెట్ ఇస్తామని ఆశపెట్టడంతో పార్టీమారాలని నిర్ణయించుకున్నారు.సుమారు 40 ఏళ్ల పాటు ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు నాయకత్వం వరకు టీడీపీ అభివృద్ధి కోసం తన కుటుంబం అంకితమై పనిచేసిందని, అలాంటి పార్టీని ఇప్పుడు వీడాల్సిరావడం ఎంతో బాధగా ఉందని గుండ లక్ష్మీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త, దివంగత మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అడుగుజాడల్లో నడుస్తూ శ్రీకాకుళంలో పార్టీని కంటికి రెప్పలాకాపాడుకుంటూ వచ్చిన తనకు, కీలకమైన సమయంలో తగిన గుర్తింపు లభించలేదని ఆమె వాపోయారు. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడిన తమను కాదంటూ స్థానికంగా కొందరు వ్యూహాత్మకంగాఅణగదొక్కాలని చూశారని, ఈ అవమానాల భారాన్ని మోయలేకే పార్టీ వీడేందుకు సిద్ధమయ్యామని ఆమె తన సన్నిహితులు, అనుచరుల వద్ద ఆవేదన వెళ్లగక్కినట్లు తెలుస్తోంది.శ్రీకాకుళం మాజీ మంత్రి,వైసీపీ సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు రంగంలోకి దిగి గుండ లక్ష్మీదేవిని పార్టీలోకి ఆహ్వానించడంతో పాటు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా ఆమెను బరిలో దింపేందుకు రంగం సిద్ధం
చేశారు. నగరంలో గుండ కుటుంబానికి ఉన్న బలమైన పట్టును, సామాజికవర్గ సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల ఖర్చంతా పార్టీయే భరిస్తుందని హామీ ఇవ్వడంతో.. గుండ లక్ష్మీదేవి వైసీపీకండువా కప్పుకోవడానికి ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. త్వరలోనే ఆమె తన అనుచరులతో విస్తృత సమావేశం నిర్వహించి అధికారికంగా ఫ్యాన్ పార్టీ గూటికి చేరనున్నట్లు తెలుస్తోంది.

**విజయనగరంలో దెబ్బకు సిక్కోలులో రీవెంజ్**

స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట ఉత్తరాంధ్ర రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనును తమ పార్టీలో చేర్చుకోవడం ద్వారా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి టీడీపీ షాకిచ్చింది. మజ్జి శ్రీను పార్టీ మారడం విజయనగరం జిల్లాలో వైసీపీకి గట్టి షాక్ అని చెప్పొచ్చు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఆయనకు అనుచరగణం ఉంది. మజ్జి శ్రీనుతోపాటు ద్వితీయ శ్రేణి నాయకులు కూడా టీడీపీలోకి వెళ్లారు. 2019 ఎన్నికల్లో విజయనగరం జిల్లాలో జగన్ పార్టీ క్లీన్‌స్వీప్ చేయడంలో ఈయన కీలక పాత్ర పోషించారు. పార్టీలో చేరగానే ఆయనకు అరకు లోక్ సభ టీడీపీ అబ్జర్వర్‌గా బాధ్యతలుఅప్పగించారు.మజ్జి శ్రీనును చేర్చుకోవడం ద్వారా విజయనగరం జిల్లాలో వైసీపీని టీడీపీ దెబ్బకొడితే.. గుండ ఫ్యామిలీని తమవైపు తిప్పుకోవడం ద్వారా తెలుగుదేశం పార్టీకి శ్రీకాకుళంలో రివర్స్ షాక్
ఇవ్వడానికి వైసీపీ రెడీ అవుతోంది.శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి టీడీపీకి రాజీనామా చేసి.. వైసీపీలో చేరబోతున్నారు. తెలుగు దేశం పార్టీతో గుండ ఫ్యామిలీకి 40 ఏళ్ల అనుబంధం ఉంది.1982లో ఎన్టీఆర్ ఆహ్వానం మేరకు ఆమె భర్త గుండ అప్పల సూర్యనారాయణ టీడీపీలో చేరారు. అప్పల సూర్యనారాయణ వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన మంత్రిగానూ పనిచేశారు. 1985, 1989, 1994, 1999ల్లో ఆయన శ్రీకాకుళం ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే 2004, 2009 ఎన్నికల్లో ధర్మాన ప్రసాద రావు చేతిలో ఆయన ఓడిపోయారు.2014 ఎన్నికల్లో అప్పల సూర్యనారాయణ సతీమణి లక్ష్మీదేవి ఎమ్మెల్యేగా గెలిచారు. 2019 ఎన్నికల్లో ఆమె ఓటమిపాలవగా.. 2024 ఎన్నికల్లో ఆమెకు టికెట్ కేటాయించలేదు. అప్పలసూర్యనారాయణ అనుచరుడిగా వ్యవహరించిన గోండు శంకర్‌కు టీడీపీ టికెట్ దక్కగా, ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు.2026 జనవరి 12న అప్పల సూర్యనారాయణ కన్నుమూశారు. శ్రీకాకుళంలో రెండు చోట్ల ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తామని తన కుమారులు చంద్రబాబు నాయుణ్ని కలిసి కోరారని.. పార్టీ అధినేత అంగీకరించినా, విగ్రహం ఏర్పాటు చేయనీయలేదని లక్ష్మీదేవి వాపోయారు. 40 ఏళ్లుగాపార్టీలో ఉంటున్న తమను అవమానాలకు గురి చేస్తున్నారని, తట్టుకోలేకే తాను పార్టీకి రాజీనామా చేస్తున్నానని ఆమె ప్రకటించారు.గుండ లక్ష్మీదేవి తన అనుచరులతో కలిసి వైఎస్సార్సీపీలోచేర బోతున్నారని ధర్మాన ప్రసాద రావు ఇప్పటికే బహిరంగంగా ప్రకటించారు. 50 వేల మంది అనుచరులతో ఆమె వైసీపీలోకి రాబోతున్నారన్నారు. గుండ లక్ష్మీదేవి ధర్మాన బ్రదర్స్‌కు వరుసకు సోదరిఅవుతారు. టీడీపీలో గుండ ఫ్యామిలీ అసంతృప్తితో ఉన్న విషయాన్ని గమనించిన ధర్మాన ఆమెను వైసీపీలోకి ఆహ్వానించారని తెలుస్తోంది. గుండ లక్ష్మీదేవి వైసీపీలో చేరితే ఆమెకు మేయర్ టికెట్‌ఇస్తామని.. ఖర్చు మొత్తం తామే భరిస్తామని ధర్మాన హామీ ఇచ్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. కోర్టు కేసు కారణంగా శ్రీకాకుళం కార్పొరేషన్ ఎన్నికలు ఇప్పుడు జరగడం లేదు. అంతేకాదు 2029ఎన్నికల్లో ఆమె చిన్నకుమారుడు గుండ విశ్వనాథ్‌కు శ్రీకాకుళం ఎంపీ టికెట్ కూడా ఇచ్చే అవకాశం ఉందని సమాచారం.శ్రీకాకుళం మేయర్ రేసులో వైసీపీ తరఫున గుండ లక్ష్మీదేవి నిలబడితే.. కూటమి అభ్యర్థికి గట్టిపోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. శ్రీకాకుళంలో గుండ ఫ్యామిలీకి మంచి పట్టు ఉంది. మరోవైపు స్థానిక సంస్థలఎన్నికల్లో కూటమి సీట్ల పంపకాల్లో భాగంగా శ్రీకాకుళం మేయర్ స్థానాన్ని జనసేనకు కేటాయించారు. టీడీపీ ఓటు బ్యాంక్ పూర్తిగా జనసేనకు బదిలీ అవుతుందా అనేది ఒక ప్రశ్న. అలాగే గుండ లక్ష్మీదేవివెంట ఆమె అనుచరగణం కూడా పార్టీ మారితే.. టీడీపీ ఓటు బ్యాంకుకు కూడా గండిపడుతుంది. ఈ రెండూ జనసేన అభ్యర్థికి పడే ఓట్లను ప్రభావితం చేసే అవకాశం ఉంది.అంటే విజయనగరంలో వైసీపీకిటీడీపీ షాకిస్తే.. జగన్ పార్టీ దానికి శ్రీకాకుళం బదులు తీర్చుకోనుందన్నమాట. ఈ రెండు పార్టీల వ్యూహాలు, ప్రతివ్యూహాలతో ఉత్తరాంధ్ర రాజకీయం రసవత్తరంగా మారుతోంది. అయితే ఈ పరిణామాలు
శ్రీకాకుళం మేయర్‌గా పోటీ చేయనున్న జనసేనను టెన్షన్ పెట్టే అవకాశం ఉంది.

# సాయివర్షితకు ఏకంగా ఆరు ప్రభుత్వ ఉద్యోగాలు

**కడప, అక్టోబరు 22,**ఒక్క ఉద్యోగం సాధించడానికే కష్టపడుతున్న ఈ రోజుల్లో.. ఆ యువతి వరుసగా ఆరు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. తొలి ప్రయత్నం సక్సెస్ కాకపోయినా మళ్లీ కష్టపడి చదివి అనుకున్నదిసాధించారు కడప జిల్లా పులివెందులకు చెందిన చిదిగే సాయి వర్షిత అనిలాదేవి, గురుదత్త దంపతుల రెండో కుమార్తె చిదిగే సాయి వర్షిత పులివెందులలో టెన్త్ వరకు చదివారు.. అనంతరం ఇంటర్మీడియట్
హైదరాబాద్ ఎన్టీఆర్ జూనియర్ కాలేజీలో పూర్తి చేశారు. అనంతరం విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య సెంట్రల్ లా యూనిర్శిటీలో చదివారు.. ఆమె న్యాయశాస్త్రంలో నాలుగు గోల్డ్ మెడల్స్‌సాధించారు.సాయి వర్షిత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రిపేర్ అయ్యారు.. 2024లో మొదటిసారి స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ పరీక్ష రాశారు. కానీ ప్రిలిమ్స్‌కు ఎంపికైనా మెయిన్స్‌లో సెలక్ట్ కాలేదు. ఓటమి నుంచిపాఠాలు నేర్చుకుని మళ్లీ కష్టపడి చదివారు. ఆ వెంటనే సాయి వర్షితకు కేంద్ర న్యాయశాఖలో వరుసగా ఉద్యోగాలు వచ్చాయి. సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్, జూనియర్ కోఆపరేటివ్ ఆఫీసర్, జూనియర్ అకౌంటెంట్, టెక్నికల్ క్లర్క్ పోస్టులు దక్కాయి. సాయి వర్షిత అక్కడితో ఆగలేదు.. కేంద్రం ప్రభుత్వంలో ఇంకా మంచి ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివారు.సాయి వర్షిత ఎస్ఎస్‌సీ సీజీఎల్ పరీక్షకు ప్రిపేర్ అయ్యారు.. ఈ పోస్టులు మొత్తం 412 ఉంటే.. దేశవ్యాప్తంగా ఏకంగా 28లక్షల15వేల445 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 13.77 లక్షల మంది పరీక్షరాగాయ.. సాయి వర్షితకు ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌లో రీసెర్చ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం సాధించారు. ఆమె ఈ నెల 19న బెంగళూరులో కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే నుంచి నియామక పత్రం అందుకున్నారు.ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రిపేర్ అయ్యేవారు ముందుగా ఓ టారట? పెట్టుకోవాలంటున్నారు సాయి వర్షిత. అన్ని అంశాలను పరిశీలించి.. సబ్జెక్టువారీగా చదవాలని సూచిస్తున్నారు. ఒక ప్రణాళిక ప్రకారం చదివితేఉద్యోగం సాధించొచ్చంటున్నారు. ఒకవేళ ఏదైనా వైఫల్యం ఎదురైతే సమీక్షించుకుని ముందుకు సాగాలంటున్నారు.

# దసరా రికార్డులు...18 లక్షల దర్శనాలు.. 36 లక్షల లడ్డూలు

**విజయవాడ, అక్టోబరు 22 :** విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయ్. దసరా మహోత్సవాల సందర్భంగా శ్రీ కనకదుర్గ అమ్మవారి దర్శనార్థం భారీగా భక్తులుతరలివచ్చారు. లడ్డూ ప్రసాదం విక్రయాల్లో సరికొత్త రికార్డును నమోదు చేశాయి. దుర్గమ్మ దర్శనార్థం వచ్చిన లక్షల మంది భక్తులకు ఎటువంటి కొరత రాకుండా దేవాదాయ శాఖ కమిషనర్ పర్యవేక్షణతోదేవస్థానం పకడ్బందీ ప్రణాళికతో లడ్డూ ప్రసాదాన్ని అందుబాటులో ఉంచింది.ఉత్సవాలు ప్రారంభమైన అక్టోబర్ 11 నుంచి అక్టోబర్ 21 దసరా మరుసటి రోజువరకూ భక్తుల రద్దీ ఇలా ఉందిశరన్నవరాత్రిఉత్సవాల్లో భాగంగా 10 రోజులలో మొత్తం 15,05,359 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోగా.. అక్టోబర్ 21 రాత్రి 7 గంటల సమయానికి సుమారు 1,55,000 మంది భక్తులుదర్శనం చేసుకున్నారు. దీంతో ఇప్పటివరకు మొత్తం 11 రోజుల్లో కనకదుర్గమ్మను దర్శించుకున్న భక్తుల సంఖ్య 18,60,359 కి చేరింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లలోపటిష్టమైన ఏర్పాట్లు, మంచినీరు, ప్రసాదం పంపిణీ నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. భక్తులు దేవస్థాన నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా దర్శనాలు పూర్తి చేసుకుంటున్నారు.ఈ ఏడాది దసరాశరన్నవరాత్రి మహోత్సవాల్లో లడ్డూ ప్రసాదం విక్రయాల్లో సరికొత్త రికార్డు...10 రోజుల్లో రికార్డు స్థాయిలో 30,69,048 లడ్డూల విక్రయం జరిగింది. ఈ సంఖ్య గతేడాది కన్నా 7.49 లక్షలు అధికం.ఇక 12వ రోజైన సాయంత్రం 6:00 గంటల వరకు 5,08,676 లడ్డూలు విక్రయం జరిగింది. ఇప్పటివరకూ విక్రయించిన లడ్డూల సంఖ్య 35,77,724. భక్తుల రద్దీకి అనుగుణంగాఎలాంటి కొరత లేకుండా నిరంతరాయంగా లడ్డూ ప్రసాదం అందిస్తున్నారు దేవస్థానం అధికారులు.

## దేవరగట్టులో రక్తసిక్తమైన బన్నీ ఉత్సవం

దసరా తరువాత జరిగే దేవరగట్టు బన్నీ ఉత్సవాలు రక్తసిక్తంగా మారాయి. బన్నీ జైత్రయాత్రలో భక్తుల మధ్య కర్రల సమరం నడిచింది. రింగులు తొడిగిన కర్రలతో పరస్పరం దాడులు జరుపుకున్నారు. అల్లరిమూకలు గాల్లోకి కాగడాలు విసిరాయి. ఈ సారి ఉత్సవంలో 80 మందికి గాయాలు అయినట్లు పోలీసులు నిర్ధారించారు. అందులోఎనిమిది మంది పరిస్థితి విషమంగా వుంది

## కాకినాడ జిల్లాలో ఘోర ప్రమాదం.. నలుగురు భవాని భక్తులు మృతి

కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి వద్ద జాతీయ రహదారి-16పై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది.విజయనగరం జిల్లా నుంచి విజయవాడకు వెళ్తున్న భవాని మాలధారుల బస్సు , మరమత్తులకోసం నిలిచిపోయింది.టీ తాగేందుకు రోడ్డు పక్కకు వెళ్లిన భక్తులను స్కార్పియో కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరికి గాయాలు అయ్యాయి. మృతులంతావిజయనగరం జిల్లా డెంకాడ గ్రామానికి చెందినవారిగా గుర్తించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

# యనమల ముందుజాగ్రత్త.. తప్పిన పెను ప్రమాదం

మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఛాతీలో అసౌకర్యంగా ఉండటంతో గురువారం ఉదయం కాకినాడ ట్రస్ట్ ఆస్పత్రిలో ఆయన చేరారు. పరిస్థితిని గమనించిన వైద్యులు సత్వరమే వైద్యం అందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని చెబుతున్నారు. అయితే 48 గంటల పాటు వైద్యుల పర్యవేక్షణలోనే ఉండాలని చెబుతుండటంతో యనమల అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముందుగానే తన ఆరోగ్య సమస్యను గుర్తించి సకాలంలో ఆసుపత్రికి రావడం వల్ల యనమలకు ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారు. ఆస్పత్రిలో చేరిన వెంటనే యాంజియోగ్రామ్ నిర్వహించామని, అనంతరం పరిస్థితిని బట్టి యాంజియోప్లాస్టీ చేశామని యనమలకు వైద్యం చేసిన డాక్టర్ రామకృష్ణ మీడియాకు తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నప్పటికీ, గుండె సంబంధిత చికిత్స కావడంతో మరో 48 గంటల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంచాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ూతీఓటటఱఝశ్రీ ×ఠవశ్రీఱస్త్రవఅఎవ బంవంగుండె రక్తనాళాల్లో (కరోనరీ ఆర్టరీస్) పూడికలు లేదా బ్లాక్‌లు ఏమైనా ఉన్నాయో లేదో పరిశీలించడానికి చేసే వైద్య పరీక్షనే యాంజియోగ్రామ్ అంటారు. గుండె నొప్పులు, ఛాతిలో అసౌకర్యం లేదా గుండె సంబంధిత సమస్యల లక్షణాలు ఉన్నప్పుడు రక్తనాళాల పరిస్థితిని స్పష్టంగా తెలుసుకోవడానికి ఈ పరీక్ష సహాయపడుతుంది. ఎక్స్-రే టెక్నాలజీ, ప్రత్యేక డై సాయంతో గుండె నరాల్లో రక్తప్రసరణ ఎలా ఉందో డాక్టర్లు ఈ పరీక్ష ద్వారా గుర్తిస్తారు. ఇక యాంజియోగ్రామ్ పరీక్షలో రక్తనాళాల్లో అడ్డంకులు లేదా పూడికలు ఉన్నట్లు తేలితే, వాటిని తొలగించి రక్తప్రసరణను పునరుద్ధరించడానికి యాంజియోప్లాస్టీ చేస్తారు. గుండెపోటు రాకుండా నివారించడానికి లేదా రక్తనాళాల్లోని పూడికలను సరిచేసి గుండెకు సక్రమంగా రక్తం అందేలా చేయడానికి ఈ చికిత్స అత్యంత కీలకం.
ఎటువంటి గుండె సమస్యలైనా సకాలంలో గుర్తించి ఆసుపత్రికి వెళ్లడం ప్రాణాలను కాపాడుకోవడంలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంటుంది. యనమల రామకృష్ణుడు విషయంలోనూ అదే జరిగిందని చెబుతున్నారు. ముందస్తుగా లక్షణాలను గుర్తించి వెంటనే ఆసుపత్రిని ఆశ్రయించడం వల్ల వైద్యులు క్షణం కూడా ఆలస్యం చేయకుండా అవసరమైన పరీక్షలు నిర్వహించి, సకాలంలో యాంజియోప్లాస్టీ చేయగలిగారు. దీనివల్ల పెద్ద ప్రమాదం తప్పిందని, ఆయన ప్రస్తుతం కోలుకుంటున్నారని వైద్యులు ధైర్యం చెప్పారు.వయసురీత్యా సీనియర్ సిటిజన్లు గుండె సంబంధిత సమస్యలు రాకుండా కొన్ని కీలకమైన ఆరోగ్య జాగ్రత్తలు పాటించడం చాలా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. క్రమం తప్పకుండా బీపీ, షుగర్, ఈసీజీ, లిపిడ్ ప్రొఫైల్ వంటి సాధారణ పరీక్షలు చేయించుకోవడం, నూనె పదార్థాలు తగ్గించి పీచు పదార్థాలు ఉండే ఆహారం తీసుకోవడం మంచిదని అంటున్నారు. అలాగే, వైద్యుల సలహా మేరకు తేలికపాటి నడక లేదా యోగా చేయడం, మానసిక ఒత్తిడికి దూరంగా ఉండటం ద్వారా గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చునని చెబుతున్నారు. ఛాతిలో నొప్పి, ఆయాసం, గుండె దడ వంటి చిన్న లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలి తప్ప ఎప్పుడూ నిర్లక్ష్యం చేయకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఆర్యాద్వి

# సంపాదకీయం Editorial




స్థానిక సంస్థల ఎన్నికల్లో జగన్ చేసిన వ్యూహాత్మక తప్పిదమే ఇప్పుడు ఈ ఘర్షణలకు కారణమవుతున్నాయి. ఆయన పోటీ చేయాలని ఒక్క పిలుపు ఇచ్చి ఊరుకుంటే సరిపోయేది. ఏకగ్రీవమయితే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు కూడా దక్కవని ఇచ్చిన వార్నింగ్ తోనే కూటమి నేతలు అప్రమత్తమయ్యారని వైసీపీ నేతలే ఆరోపిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికలలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన పార్టీ నాయకులను హెచ్చరిస్తూ చేసిన వ్యాఖ్యలు మరియు ప్రస్తుత రాజకీయ పరిణామాలు రాష్ట్రంలో తీవ్ర చర్చకు దారితీశాయి. జగన్ వ్యూహం తప్పుగా మారిందా లేదా అనే అంశంపై రాజకీయ వర్గాల్లో భిన్నమైన విశ్లేషణలు వినిపిస్తున్నాయి. మౌనంగా ఉండి పోటీ చేయాలని మాత్రమే చెప్పి ఉంటే ఇంతటి ఉద్రిక్తతలు నెలకొని ఉండేవి కావన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

### జగన్ ఇచ్చిన వార్నింగ్ తోనే...

ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు జరిగిన పార్టీ సమావేశాలలో జగన్ మోహన్ రెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లకు మరియు నేతలకు "స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడా ఏకగ్రీవాలు జరగడానికి వీల్లేదు" అని కఠినమైన వార్నింగ్ ఇచ్చారు. ఒకవేళ ఏదైనా స్థానంలో పోటీ పెట్టకుండా కూటమి అభ్యర్థుల ఏకగ్రీవానికి సహకరిస్తే, ఆ ఇన్‌చార్జ్‌లకు భవిష్యత్తులో ఎమ్మెల్యే సీట్లు కూడా ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. పార్టీ శ్రేణుల్లో ధైర్యం నింపేందుకు మరియు ప్రతి సీటులోనూ పోటీ గట్టిగా ఉండాలనే ఉద్దేశంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో నియోజకవర్గాల ఇన్ ఛార్జులు తెగించి మరీ బరిలోకి దిగారు. దీంతో దాడులు – ప్రతి దాడులుజరిగాయి. అదే సమయంలో కూటమి నేతలు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. అసలు నామినేషన్లు వేయకుండా అడ్డుకుని అధికారంలో తాము ఉన్నామని జగన్ కు గుర్తు చేసినట్లయింది. ఇది సాధారణ ఎన్నికలు కావన్నది జగన్ విస్మరించారు.

### గ్రౌండ్ లెవెల్ లో ఏం జరిగిందంటే...?

జగన్ హెచ్చరికల అనంతరం పులివెందుల, పుంగనూరు, రాయచోటి, మైదుకూరు వంటి వైసీపీకి బలమైన కోటలుగా ఉన్న ప్రాంతాలలో సైతం పలు మున్సిపాలిటీలు, వార్డులు కూటమి పరమవబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీనికి విశ్లేషకులు చెప్తున్న ప్రధాన కారణాలు ఇలా ఉన్నాయి. ఎన్నికల ఖర్చంతా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మరియు అభ్యర్థులే భరించాలని, పార్టీ నుండి ఎలాంటి ప్రత్యేక ఆర్థిక సహాయం ఉండదని జగన్ ముందే తేల్చిచెప్పడం వల్ల చాలామంది కొంత నిరాశలో పడ్డారు. తమ అభ్యర్థులను నామినేషన్లు వేయనీయకుండా కూటమి ప్రభుత్వం, పోలీసులు అడ్డుకున్నారని, నామినేషన్ పత్రాలను చింపేస్తూ అరాచకాలకు పాల్పడ్డారని జగన్ స్వయంగా ఆరోపించారు. దీనిపై ఆయన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మరియు గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.నామినేషన్ల ప్రక్రియలో జరిగిన గొడవలు మరియు అభ్యర్థులను అడ్డుకున్న అంశాలపై వైఎస్సార్సీపీ సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించింది. అయితే ఇంతకీ జగన్ సాధించిందేందన్న ప్రశ్న మాత్రం నేతల్లో వ్యక్తమవుతుంది.

- సూర్యుడి జీవితకాలం మరో ఐదు బిలియన్ సంవత్సరాలు
- సూర్యుడు చివరి దశలో ద్రవ్యరాశిని కోల్పోతాడని అంచనా
- బాహ్య గ్రహాల కక్ష్యలు అస్థిరమయ్యే అవకాశం
- 90 శాతం సిమ్యులేషన్లలో మూడు బిలియన్ ఏళ్లలో అస్థిరత
- కొన్ని గ్రహాలు సౌర కుటుంబం నుంచి బయటికి విసిరివేయబడే ప్రమాదం




మన సౌర కుటుంబానికి కేంద్రంగా ఉన్న సూర్యుడు మరో ఐదు బిలియన్ సంవత్సరాల వరకు ప్రస్తుతంలాగే ప్రకాశించే అవకాశం ఉంది. అయితే, ఆ తర్వాత సౌర కుటుంబంలో చోటుచేసుకునే పరిణామాలు శాస్త్రవేత్తలు గతంలో అంచనా వేసిన దానికంటే వేగంగా, సంక్లిష్టంగా ఉండొచ్చని తాజా అధ్యయనం వెల్లడించింది. సూర్యుడు తన జీవిత చక్రం చివరి దశకు చేరుకున్నప్పుడు గ్రహాల కక్ష్యల్లో తీవ్ర మార్పులు సంభవించే అవకాశముందని పరిశోధకులు అంచనా వేశారు.

'ది ఆస్ట్రోఫిజికల్ జర్నల్ లెటర్స్'లో ప్రచురితమైన ఈ అధ్యయనంలో ఖగోళ శాస్త్రవేత్తలు కాన్‌స్టాంటైన్ బాటిగిన్, జిమ్ ఫుల్లర్, ఫ్రెడ్ సి.ఆడమ్స్ తదితరులు పాల్గొన్నారు. సూర్యుడు తన జీవితకాలం ముగిసే సమయంలో ద్రవ్యరాశిని ఒకే విధంగా, క్రమంగా కోల్పోకపోవచ్చని వారు పేర్కొన్నారు. అసమానమైన విరామాల్లో జరిగే ద్రవ్యరాశి నష్టం సౌర కుటుంబంలోని బాహ్య గ్రహాల కక్ష్యలను ప్రభావితం చేయవచ్చని వివరించారు.

సాధారణంగా సూర్యుడిలో హైడ్రోజన్ ఇంధనం తగ్గిపోయిన తర్వాత అది విస్తరించి ఎర్రటి రాక్షస నక్షత్రంగా మారుతుంది. అనంతరం తన బయటి పొరలను కోల్పోయి తెల్ల మరుగుజ్జు నక్షత్రంగా మిగులుతుంది. ఈ పరిణామాల సమయంలో సూర్యుడి గురుత్వాకర్షణ ప్రభావం మారడంతో గ్రహాల కదలికల్లోనూ మార్పులు వచ్చే అవకాశం ఉంటుంది.

### కంప్యూటర్ సిమ్యులేషన్లలో ఏం తేలింది?

బృహస్పతి, శని, యురేనస్, నెప్ట్యూన్ గ్రహాల కదలికలను పరిశోధకులు వందలాది కంప్యూటర్ సిమ్యులేషన్ల ద్వారా పరిశీలించారు. సూర్యుడు తెల్ల మరుగుజ్జు నక్షత్రంగా మారిన తర్వాతి పరిస్థితులను వీటిలో అనుకరించారు. సుమారు 90 శాతం సిమ్యులేషన్లలో, సూర్యుడు ఆ దశకు చేరుకున్న తర్వాత మూడు బిలియన్ సంవత్సరాల్లోపు సౌర కుటుంబంలోని బాహ్య గ్రహాల వ్యవస్థ అస్థిరంగా మారినట్లు గుర్తించారు.

సూర్యుడు తన ద్రవ్యరాశిని కోల్పోయే సమయంలో గ్రహాల కక్ష్యలు మారవచ్చు. కొన్ని గ్రహాల కక్ష్యలు ఒకదానికొకటి దగ్గరగా రావడం, గ్రహాల స్థానాలు మారడం, చివరికి కొన్ని గ్రహాలు సౌర కుటుంబం నుంచి బయటకు విసిరివేయబడటం వంటి పరిణామాలు సంభవించవచ్చు. అయితే, ప్రతి గ్రహం ఢీకొంటుందని లేదా సౌర కుటుంబం మొత్తం నాశనమవుతుందని ఈ అధ్యయనం చెప్పడం లేదు. ఇవి కంప్యూటర్ నమూనాల్లో కనిపించిన పరిణామాలు మాత్రమే.

### భూమికి ఏం జరుగుతుంది?

భూమికి ముప్పు మాత్రం ఇంకా చాలా దూరంలో ఉంది. సుమారు ఐదు బిలియన్ సంవత్సరాల తర్వాత సూర్యుడు విస్తరించే దశకు చేరుకున్నప్పుడు బుధుడు, శుక్రుడు, భూమి దాని ప్రభావానికి గురయ్యే అవకాశం ఉంది. అప్పటికంటే ముందే సూర్యుడి ప్రకాశం, వేడి పెరగడం వల్ల భూమిపై సముద్రాలు, వాతావరణం, జీవరాశి మనుగడకు అనుకూల పరిస్థితులు క్రమంగా దెబ్బతినవచ్చు.

ఈ పరిశోధన వల్ల సూర్యుడు త్వరలోనే అంతరించిపోతాడని భావించాల్సిన అవసరం లేదు. నక్షత్రాలు తమ జీవిత చక్రం చివరి దశకు చేరుకున్నప్పుడు వాటి చుట్టూ తిరిగే గ్రహ వ్యవస్థలు ఎలా మారతాయో అర్థం చేసుకోవడానికి ఈ అధ్యయనం ఉపయోగపడుతుంది.


## రచయితలకు ఆహ్వానం!

మీ ఆలోచనలకు అక్షరరూపం ఇవ్వండి..

మీ రచనలు, కథలు, కవితలు, వ్యాసాలు, సామాజిక అంశాలపై మీ అభిప్రాయాలను ఆర్యాద్వి పత్రిక ద్వారా పాఠకులకు చేరవేయండి. మీ రచనలకు మా వేదికపై ప్రత్యేక స్థానం కల్పిస్తాం.

ఆసక్తి ఉన్న రచయితలు తమ రచనలను మాకు పంపించండి




పంపాల్సిన చిరునామా:
వాట్సాప్ నంబర్:
9912456573

**ఏడాదంతా లభించే తక్కువ ధరకు .. ఎక్కువ పోషకాలతో మార్కెట్లో లభించే పండ్లలో జామకాయ ఒకటి. చాలామంది ఇళ్లలో గోడ పక్కన బయట ఈ చెట్టును పెంచుకుంటారు. అంటే జామకాయలంటే పిల్లలకు.. పెద్దలకు ఎంత ఇష్టమో మరే వేరే చెప్పనక్కరలేదు. వీటిని డైరక్ట్‌గా తింటారు. కొంతమంది సలాడ్స్, స్నాక్స్ రూపంలో.. మరికొంత మంది జ్యూస్ చేసుకుంటారు.. ఇలా ఎవరికి ఇష్టం వచ్చిన రీతిలో వారు జామపండును ఆరగిస్తారు. కాని దీనిని ఎప్పుడు పడితే అప్పుడు తినకూడదని .. నిత్యం కొన్ని సమయాల్లోనే తినాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. మరి జామ పండును ఎప్పుడు తినాలి.. ఏ సమయంలో తినాలి.. మొదలగు విషయాలను ఈస్టోరీలో తెలుసుకుందాం. . .!**






# జామకాయ తింటే ఎంతో ఆరోగ్యం.. కాని ఎప్పుడు తినాలి.. ఎప్పుడు తినకూడదు..



జామకాయలు టేస్ట్ వేరు.. అంతే కాదు.. అనేక రోగాలకు మంచి మందు కూడా.. దీనిలో ఉండే పోషకాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. జామపండును తీసుకోవడం వల్ల మన మొత్తం శరీర ఆరోగ్యం మెరుగుపడుతుంది. జామకాయలను తీసుకోవడం వల్ల మన శరీరానికి కలిగే మేలు గురించి అలాగే దీనిని తీసుకునే సరైన సమయం గురించి పోషకాహార వైద్యులు వివరిస్తున్నారు. దీనిని ఎప్పుడు పడితే అప్పుడు తినకూడదని నిపుణులు చెబుతున్నారు.

**ఎప్పుడు తినాలి..**

జామకాయ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటలలోపు తినాలి. ఉదయం బ్రేక్ ఫాస్ట్ చేసిన తరువా 30 నిమిషాల తరువాత గంటలోపుగా ఒక మోస్తరు ( చిన్నసైజు) జామకాయను తింటే ఎలాంటి ఇబ్బంది లేకుండా తిన్న పదార్థం జీర్ణక్రియ జరుగుతుందని చెబుతున్నారు. కాని రాత్రి సమయంలో జామపండును అసలు తినకూడదు

ఇంకా మధ్యాహ్నం భోజనం చేసిన 2 గంటల తరువాత జామకాయ తింటే ఆరోగ్యానికి మంచిది. ఎక్కడైనా ఫంక్షన్లకు వెళ్లినప్పుడు మాత్రం అన్నం తిన్న తరువాత తప్పకుండా జామపండును తినాలి. ఇలా తినడం వలన జీర్ణక్రియలో ఎలాంటి సమస్యలు రావు. పొద్దున్నే పరగడుపున .. ఖాళీ కడుపుతో మాత్రం అస్సలు జామపండు తినకూడదు. ఇలా తింటే జామపండు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వాటితో ఉండే పోషకాలు శరీరానికి అంది.. చాలా ఎక్కువగా ఆరోగ్య ప్రయోజనాలు పొందుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

**రుచితో పాటు ఆరోగ్యం**

జామకాయలు రుచితో పాటు ఆరోగ్యానికి మేలు కలుగజేస్తాయి. వీటిలో విటమిన్ సి తో పాటు అనేక సూక్ష్మ పోషకాలు కూడా ఉంటాయి. దీనిని దేశీ సూపర్ ఫ్రూట్ అని కూడా పిలుస్తారు. 100 గ్రాముల జామకాయల్లో 68 కిలో కేలరీలు, 2.5 గ్రా. ప్రోటీన్, 14 గ్రాముల కార్బోహైడ్రేట్స్, 5.4 గ్రాముల ఫైబర్ కంటెంట్ ఉంటుంది. అలాగే 100 గ్రాముల జామపండులో దాదాపు 228 మి.గ్రా. విటమిన్ సి ఉంటుంది. జామపండునుతినడం వలన పేగు కదలికలు ఎక్కువగా ఉంటాయి. తద్వారా తిన్న ఆహారం సులభంగా జీర్ణమవ్వడంతో పాటు మలబద్ధకం సమస్య కూడా తగ్గుతుంది.

**విటమిన్ సి..**

జామపండు మన శరీరానికి అనేక విధాలుగా మేలు చేస్తుంది. వైద్య నిపుణలు తెలిసిన వివరాల ప్రకారం రోజూ ఒక జామపండును తింటే శరీరానికి కావల్సిన విటమిన్ సి అందడంతో చర్మ ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు చర్మం బిగుతుగా తయారవుతుంది. ఇంకా ఇందులో లభించే విటమిన్ సి కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది.

**బరువు అదుపులో..**

జామపండులో పొటాషియం ఎక్కువ మోతాదులో ఉండటం వలన బీపీ అదుపులో ఉంటుంది.

శరీర బరువును అదుపులో ఉంచడంలో కూడా జామపండు మనకు సహాయపడుతుంది. దీనిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆకలి త్వరగా వేయకుండా ఉంటుంది. దీంతో శరీర బరువు అదుపులో ఉంటుంది.

జామపండును తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. జామపండు తక్కువ గ్లైసెమిక్ స్థాయిలను కలిగి ఉంటుంది. కనుక షుగర్ వ్యాధి గ్రస్తులు కూడా ఈ పండును తింటే ఎలాంటి ఇబ్బంది ఉండదు. జామపండులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. కనుక దీనిని తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇన్ఫెక్షన్లు త్వరగా మన దరి చేరకుండా ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

# బాక్సాఫీస్ వద్ద... 'రణబాలి' రికార్డుల మోత!



ప్రముఖ డైరెక్టర్ రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో రౌడీ హీరో విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్న నటించిన చిత్రం 'రణబాలి'. 1870లలో మద్రాస్ ప్రెసిడెన్సీలో సంభవించిన కరువు, ఆ సమయంలో బ్రిటీష్ వారి దారుణాలు ఇతర అంశాల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మించారు. దసరా కానుకగా అక్టోబర్ 16న విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన వసూళ్లతో దూసుకెళ్తోంది. పండుగ సందర్భంగా విడుదలైన ఈ చిత్రానికి మొదటి రోజున కొద్దిగా మిక్స్‌డ్ టాక్ లభించింది. అయినప్పటికీ ఈ మిశ్రమ స్పందన ఎఫెక్ట్ కలెక్షన్లపై ఏ మాత్రం పడలేదు. విజయ్ దేవరకొండ, రష్మికల స్టార్‌డమ్, ప్రేక్షకుల నుంచి వస్తున్న ఆదరణతో సినిమా బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకెళ్తోంది. ఈ చిత్రానికి దసరా పండుగ సీజన్ చాలా బాగా కలిసొచ్చింది. ముఖ్యంగా మంగళవారం దసరా పండగ సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని పలు థియేటర్లలో 'రణబాలి'కి హౌస్‌ఫుల్ కలెక్షన్లు నమోదయ్యాయి. రిలీజ్ రోజున టాక్ ఎలా ఉన్నప్పటికీ.. పండగ సెలవులు కలిసిరావడం, విజయ్-రష్మికల క్రేజ్ కారణంగా ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్ల బాట పట్టడంతో వసూళ్లు భారీగా పెరిగాయి. వ్యాపార వర్గాల అంచనా ప్రకారం.. 'రణబాలి' చిత్రం ఇప్పటికే తన ప్రీ-రిలీజ్ బిజినెస్‌లో దాదాపు 70 శాతం రికవరీ సాధించింది. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో ఈ సినిమా ఇప్పటికే బ్రేక్ ఈవెన్ పూర్తి చేసుకుని లాభాల బాటలోకి అడుగుపెట్టినట్లు సమాచారం. ఇదే జోరు రాబోయే రోజుల్లో కూడా కొనసాగితే ఈ వారంలోనే మిగిలిన అన్ని ప్రాంతాల్లోనూ సినిమా బ్రేక్ ఈవెన్ సాధించి క్లీన్ హిట్ అవుతుందని ట్రేడ్ నిపుణులు భావిస్తున్నారు.

రణబాలి' ఓ చారిత్రక కథాంశంతో తెరకెక్కడంతో ఈ జానర్‌ను ప్రేక్షకులకు సరిగ్గా అర్థం చేయించేందుకు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ప్రత్యేకంగా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇలాంటి చారిత్రక కథలు అరుదుగా వస్తాయని, మన చరిత్రలోని ఓ ముఖ్యమైన భాగాన్ని అందరికీ చేరవేయాలనే ఉద్దేశంతో వారు రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ప్రమోట్ చేశారు. ఈ ప్రచారమే ప్రేక్షకులలో సినిమాపై ఆసక్తిని పెంచడంలో కీలకపాత్ర పోషించిందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. మిక్స్‌డ్ టాక్ ఉన్నప్పటికీ.. 'రణబాలి' ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు దాదాపు రూ.55 కోట్ల నుంచి రూ.60 కోట్ల వరకు గ్రాస్ వసూళ్లను సాధించినట్లు సమాచారం. అయితే దీనికి సంబంధించిన అధికారికంగా ప్రకటన వెలువడాల్సి ఉంది. మొత్తానికి స్టార్ హీరోల క్రేజ్, పండగ సెలవులు ఈ సినిమాకు శ్రీరామరక్షగా నిలిచాయి.ానున్న రోజుల్లో ఈ చిత్రం లాభాల బాటలో ఎంతవరకు నిలదొక్కుకుంటుందనేది ఉత్కంఠగా మారింది.

పోస్టార్!



## విష్ణుప్రియ గ్లామర్ ట్రీట్



తెలుగు నాట స్టార్ యాంకర్‌గా దూసుకెళ్తున్నారు విష్ణుప్రియ భీమనేని. అయితే యాంకరింగ్ కంటే ఇతర విషయాల్లోనే ఆమె వార్తల్లో నిలుస్తుంటారు. సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే విష్ణుప్రియ.. తన వ్యక్తిగత విషయాలతో పాటు హాట్ హాట్ ఫోటో షూట్స్‌తో కుర్రాళ్లను రెచ్చగొడుతుంటారు. తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి. సినిమాలు, వెబ్ సిరీస్‌లు, టీవీ షోలతో బిజీగా ఉంటున్నారు విష్ణుప్రియ. చిన్నతనంలోనే తల్లిదండ్రులు విడిపోవడంతో ఎన్నో కష్టాలు పడింది ఈ ముద్దుగుమ్మ. తల్లి వద్దే పెరిగిన ఈ యాంకర్.. అమ్మకి అండగా నిలవాలనే ఉద్దేశంతో తన పాకెట్ మనీ, ఇతర ఖర్చుల కోసం తనే సంపాదించుకోవాలని నిర్ణయించుకుంది. చిన్నప్పటి నుంచే భారతీయ పురాణాలు, భగవద్గీత మీద పట్టు ఉంది. అలా పిల్లలకు భగవద్గీత క్లాసులు చెబుతూ తన ఖర్చులు సంపాదించుకున్నారు విష్ణుప్రియ. పరిశ్రమలోకి వచ్చాక ఫన్ బకెట్ వీడియో కోసం 500 రూపాయలను తొలుత రెమ్యునరేషన్‌గా అందుకున్న జ్ఞాపకం జీవితంలో మరిచిపోలేనని విష్ణుప్రియ పలుమార్లు ఎమోషనల్ అయ్యారు. బిగ్‌బాస్ కంటెస్టెంట్‌గా అడుగుపెట్టిన తర్వాత ఆమె మరింత పాపులర్ అయ్యారు. అవకాశాల కోసం ఎదురుచూడకుండా తనే అవకాశాలను క్రియేట్ చేసుకున్నారు విష్ణుప్రియ. ఈ క్రమంలోనే ఇన్‌స్టాగ్రామ్ తీసుకొచ్చిన సబ్‌స్క్రిప్షన్ ఆప్షన్ ద్వారా ఎక్స్‌క్లూజివ్ కంటెంట్ షేర్ చేస్తున్నారు. ఆమె సబ్‌స్క్రిప్షన్ పేజికి వేలాది మంది ఫాలోవర్స్ ఉన్నారు. దీని ద్వారా విష్ణు నెలకు లక్షల్లో సంపాదిస్తోంది. ఏ విషయంపై అయినా కుండబద్ధలు కొట్టినట్లు మాట్లాడటం విష్ణుప్రియ స్టైల్. తనకు మూడు సార్లు బ్రేకప్ అయ్యిందని, అలాగే తన బాడీ కౌంట్ 5 అని చెప్పింది. అంటే ఐదుగురితో రొమాన్స్ చేసినట్లు ఒప్పుకుంది. ఇన్‌స్టాగ్రామ్ సబ్‌స్క్రిప్షన్ గురించి కూడా విమర్శలు రాగా దానికి తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు విష్ణుప్రియ. అంతేకాదు.. నెలకు 399 సబ్‌స్క్రిప్షన్ ఫీజు అంటే చాలా ఎక్కువగా ఉందని కొంచెం తగ్గించాలని అడగ్గా.. ససేమిరా అని నో చెప్పేసింది. ఇక విష్ణుప్రియకు ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపు 1.4 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. తన వ్యక్తిగత విషయాలు, ఇతర అంశాలు, వీడియోలు, ఫోటోలను అభిమానులతో పంచుకుంటారు ఈ ముద్దుగమ్మ. తాజాగా విష్ణుప్రియ అందంగా ముస్తాబై ఓ ఫోటో షూట్ నిర్వహించారు. గేటు ముందు నిలబడి రొమాంటిక్ ఫోజుల్లో అందాల విందు చేశారు. ప్రస్తుతం ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి.




## నవంబర్ 6న 'సమ్మర్ హాలిడేస్' విడుదల

ప్రముఖ నిర్మాత, పంపిణీ దారుడు ధీరజ్ మొగిలినేని నిర్మించిన చిత్రం 'సమ్మర్ హాలిడేస్'. ఈ యేడాది మే1న విడుదల కావాల్సిన ఈ సినిమా రకరకాల కారణాల వల్ల విడుదల వాయిదా పడుతూ వచ్చింది. చివరకు అక్టోబర్ 30న పక్కాగా వస్తున్నట్టు మేకర్స్ తెలిపారు. అయితే ఇప్పుడు అదే రోజున వెంకటేశ్ - త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం' వస్తున్న నేపథ్యంలో మరోసారి ఈ సినిమాను వాయిదా వేయాల్సి వచ్చింది. ఈసారి ఖచ్చితంగా నవంబర్ 6న తమ చిత్రాన్ని విడుదల చేస్తామని దర్శక నిర్మాతలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ ఇవాళ చిత్రసీమలో ఉన్న పరిస్థితులను వివరించారు. ఆయన తమ చిత్రం గురించి మాట్లాడుతూ, 'నిజానికి నిర్మాతల మధ్య ఎలాంటి కమ్యూనికేషన్ గ్యాప్ లేదు. అయితే పెద్ద సినిమాల నిర్మాతల చిన్న చిత్రాలకు కాస్తంత గ్యాప్ ఇవ్వాల్సిన అవసరం అయితే ఉంది. వెంకటేశ్ 'ఆదర్శ కుటుంబం' సినిమా ఎప్పుడు వచ్చినా థియేటర్లు దొరకుతాయి. కానీ మేం తీసే చిన్న సినిమాలకు నాలుగు వారాల ముందు నుంచి ఎలర్ట్ గా ఉండాలి. నిజానికి అక్టోబర్ 30న వస్తుందని భారీగా పబ్లిసిటీ చేశాం. డబ్బులన్నీ అయిపోయాయి. ఇప్పుడు మరోసారి అప్పు తెచ్చుకుని పబ్లిసిటీ చేసుకోవాలి. ఇది నాలాంటి చాలామంది నిర్మాతల పరిస్థితి. అక్టోబర్ 30న వచ్చే మరికొందరు నిర్మాతలు సైతం తమ చిత్రాలను వాయిదా వేసుకుంటున్నారు. తమిళంలో సినిమాల విడుదల సమయంలో హీరోలకు, నిర్మాతలకు మధ్య మంచి అవగాహన ఉంది. కానీ ఇక్కడ అలా జరగడం లేదు. ప్రొడ్యూసర్స్ గిల్డ్ ప్రారంభంలో పెద్ద నిర్మాతలు ఉండేవారు. సీనియర్ నిర్మాతలు యాక్టివ్‌గా ఉండేవారు. ఇప్పుడు వేరేవారు నడిపిస్తున్నారు. వారికి చిన్న నిర్మాతలంటే.. చిన్న చూపు ఉంది' అని అన్నారు. పెద్ద సినిమాల టిక్కెట్ రేట్లను పెంచడం కూడా సమంజసం కాదని ధీరజ్ మొగిలినేని అన్నారు. 'ప్రభుత్వం అలా చేయడం వల్ల రెవిన్యూ కోసం అన్నీ థియేటర్స్ లో పెద్ద సినిమాలనే ఎక్కువ వేసుకుంటున్నారు. అన్ని సినిమాలకూ ఒకటే రేట్ ఉంటే చిన్న సినిమాలకు థియేటర్స్ ఉంటాయి. ఇండస్ట్రీకి మంచి జరగాలంటే టిక్కెట్ రేట్లు పెంచొద్దు' అని ఆయన అన్నారు. సమ్మర్ కు రావాల్సిన తమ 'సమ్మర్ హాలిడేస్' సినిమా దీపావళి హాలిడేస్ కు వస్తోందని, ఈసారి పక్కాగా విడుదల అవుతుందని మాస్టర్ రోహన్ అన్నారు. ఈ సినిమా చాలా బాగా వచ్చిందని, తప్పకుండా ప్రేక్షకుల ఆదరణ పొందుతుందనే నమ్మకం ఉందని దర్శకుడు శ్రీకర్ తెలిపాడు.

## శ్రీకాకుళం యాస.. బుర్రకథ..
### - ఆ నటుడికి అసలైన పరీక్ష!



ఇటీవల విడుదలైన 'గరివిడి లక్ష్మి' సినిమాలో నటుడు రాగ్ మయూర్ పోషించిన 'సత్తిబాబు' పాత్ర ప్రేక్షకుల నుంచి విశేష ప్రశంసలు అందుకుంటోంది. ఓ వైవిధ్యమైన, సవాలుతో కూడిన పాత్రను స్వీకరించి, దానికి న్యాయం చేసేందుకు రాగ్ మయూర్ ఎంతో శ్రమించినట్లుగా తెరపై స్పష్టంగా కనిపించింది. సత్తిబాబు పాత్రలో కేవలం వయసుకు తగ్గట్టుగా కనిపించడం మాత్రమే కాకుండా అంతకంటే క్లిష్టమైన బాధ్యత మరొకటి ఉంది. శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన ఓ బుర్రకథ కళాకారుడి పాత్రలో ఒదిగిపోవడం, ఆ పాత్రను చూసే ప్రేక్షకులకు సహజంగా అనిపించేలా చేయడమే ఆ ప్రధాన సవాల్. శ్రీకాకుళం ప్రాంతీయ యాసను నేర్చుకుని, అందులోని సహజత్వాన్ని మాటల్లో స్పష్టంగా పలికించడం ఒక ఎత్తయితే, బుర్రకథ వంటి ప్రాచీన కళారూపానికి తగ్గట్టు నడవడం మరో ఎత్తు. బుర్రకథ చెప్పేటప్పుడు అవసరమయ్యే ప్రత్యేక హావభావాలు, గొంతులో తెచ్చే మాడ్యులేషన్, శరీర కదలికలను సరిగ్గా అలవర్చుకోవడం చాలా ముఖ్యం. కళాకారుడి పాత్రకు సరిపోయే భారీ దుస్తులు, అలంకరణ ధరించి సుదీర్ఘ సమయం సదరు శారీరక శ్రమను తట్టుకోవడం నటుడి క్రమశిక్షణకు పరీక్షలాంటిది. పాత్రలోని తీవ్రతను, ఉత్సాహాన్ని కోల్పోకుండా నిలకడగా నటించడం ఎంతో కష్టంతో కూడుకున్న విషయం. ఇలాంటి సాంప్రదాయ, ప్రాంతీయ పాత్రలో చిన్న పొరపాటు జరిగినా, నటన కృత్రిమంగా కనిపిస్తుంది. అందుకే ప్రాంతీయ యాస, సంభాషణల శైలి, బాడీ లాంగ్వేజ్, పాత్ర స్వభావం అనే నాలుగు కీలక అంశాలను సమన్వయం చేసుకోవడం తప్పనిసరి. ఈ నాలుగు అంశాలను సమర్థవంతంగా మేళవించి, రాగ్ మయూర్ చేసిన ముందస్తు సన్నద్ధత స్పష్టంగా కనిపిస్తోంది. తెరపై ఆయన చూపించిన మార్పులు, శ్రమ 'సత్తిబాబు' పాత్రను ప్రత్యేకంగా నిలబెట్టేలా చేస్తున్నాయి.

## తెరపైకి నరసింహా-2

దక్షిణాది సినీ ప్రియులకు నరసింహా సినిమా ఒక మరుపురాని అనుభూతి. 1999లో వచ్చిన ఈ సినిమా సృష్టించిన బాక్సాఫీస్ సునామీ, రమ్యకృష్ణ నీలాంబరిగా, రజనీకాంత్ నరసింహాగా చేసే మాస్ హంగామా ఇప్పటికీ ప్రేక్షకుల మనసుల్లో తాజాగానే ఉన్నాయి. అయితే, గత కొంతకాలంగా ఈ క్లాసిక్ సినిమాకు సీక్వెల్ రాబోతోందంటూ వార్తలు తెగ హల్‌చల్ చేస్తున్నాయి. తాజాగా ఈ ప్రాజెక్ట్ గురించి వెలువడుతున్న కథనాలు మళ్లీ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. దర్శకుడు కేఎస్ రవికుమార్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఈ సినిమా సీక్వెల్ గురించి మాట్లాడడం హాట్ టాపిక్ గా మారింది. 'గతంలోనే నరసింహా 2 కోసం కథా చర్చలు జరిగాయి. ముఖ్యంగా మొదటి భాగంలో చనిపోయిన నీలాంబరి పాత్ర మళ్లీ పునర్జన్మ ఎత్తి నరసింహపై పగ తీర్చుకునే డ్రామాతో ఒక ఐడియాను, అలాగే మరో కొత్త లైన్‌ను సిద్ధం చేసి రజనీకాంత్‌కు కూడా వినిపించాను. ఆ సమయంలో రజనీ కూడా ఆసక్తి చూపినప్పటికీ, ఇటీవల నరసింహా సినిమా రీ-రిలీజ్‌లో పొందిన గ్రాండ్ రెస్పాన్స్ చూసిన తర్వాత లెక్కలు మారాయి. రీ-రిలీజ్‌లోనే బాక్సాఫీస్ కలెక్షన్లు ఊహించని రేంజ్‌లో రావడంతో, సీక్వెల్‌పై ప్రేక్షకుల్లో అంచనాలు అంబరాన్ని తాకుతాయని రజనీ గ్రహించారు. అందుకే పాత మోడల్ కథనం సరిపోదని, నేటి తరం మేకింగ్‌కి సరిపోయేలా మరింత బలమైన స్క్రీన్‌ప్లే సిద్ధం చేయాలని సూచించారు. త్వరలోనే ఈ సీక్వెల్ ముందుకు కదలొచ్చని ఆయన తెలిపారు. ఇప్పటికే రజనీ.. జైలర్ 2 సీక్వెల్ తో భారీ విజయాన్ని అందుకున్నారు. ఇక ఇప్పుడు నరసింహా 2 సీక్వెల్ వస్తే వేరే లెవెల్ ఉంటుందని అనుకున్నా కూడా అభిమానుల్లో మాత్రం ఒక రకమైన అనుమానం వ్యక్తమవుతోంది. ఇప్పుడున్న ట్రెండ్‌కి తగ్గట్లుగా ఔట్ డేటెడ్ కాకుండా కథను ఎలా మలుస్తారు? కేఎస్ రవికుమార్ మార్క్ మేకింగ్ ఇప్పటి ట్రెండ్‌కి సెట్ అవుతుందా? అని రజనీ ఫ్యాన్స్ విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం రజనీ ధర్మన్ తో బిజీగా ఉన్నారు. దీని తరువాత కమల్ తో కలిసి ఒక సినిమా చేయబోతున్నారు. ఇవన్నీ పూర్తి అయ్యాక కానీ, ఈ సీక్వెల్ గురించి రజనీ ఆలోచించరు అని తెలుస్తోంది. మరి రజనీకాంత్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చి ఈ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కిస్తారో లేదో తెలియాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే.